"కన్యాకాలే యత్నా ద్వరితా"

జాము పొద్దెక్కింది.

చైత్రపున్నమి వెళ్ళింది కనక, అప్పటికప్పుడే యెండ చుర్రు మంటోంది.

రాయవరం నూరిళ్ళ వెలనాటి బ్రాహ్మణాగ్రహారంలోనూ వంట లయిపోతున్నాయి; కాని జానకమ్మ అప్పుడే మెల్లిగా చెరువుకి బయలుదేరింది.

చెరువుకి వెళ్ళడానికి దినమ్మూ ఆమె కిదే వేళ.

పైపనంతా దాసీపిల్ల చేసేస్తుంది కనక, యేడింటికి చిల్లర మడిపనులు కానిచ్చేసుకుని, యేడున్నరకి మొగుడితోపాటు చద్దన్నం తిని, అతనిచేత తొమ్మిదిన్నర అలారం పెట్టించుకుని, పుస్తకం పుచ్చుకునో, వీణ అందుకునో, గ్రామఫోను వేసుకునో, మొగుడు తీరుబడిగావుంటే యేచదరంగమో ఆడుతూనో కూచుంటుం దామె.

వీటిలో యేదివుండినా ఆమెకిక నిద్రాహారా లక్కర్లేదు.

అయితే, అలారం వినపడిం దంటేమాత్రం యెక్కడికయిన పని అక్కడికే ఆపేసి: వెంటనే బిందె పుచ్చుకుని బయలుదేరుతుంది.

సాధారణంగా, అసమయానికి చెరువుదగ్గిర యెవరూ వుండరు; కాని ఆవేళ మాత్రం పొరుగూరి ముసీలి బ్రాహ్మడొకడు స్నానం చేసి, తడిగుడ్డ నెత్తిన వేసుకుని చెరువులో నుంచునే జపంచేసుకుంటున్నాడు.

ఇంతలో తెమిలి వొడ్డెక్కేటట్టు కూడా లేదు.

అంచేత అతనుండగా చెరువులో దిగడానికి సిగ్గుపడి, అటూయిటూ చూస్తూ పావంచాలకు పక్కగా వుండిన రావి చెట్టు కింద నుంచుని వుండి పోయిం దామె.

ఉండిపోయిం దంటే అప్పుడే అక్కడికి వెళ్ళింది.

వెళ్ళి, బిందె బోర్లించి దాని మీద కూచోడమా, నుంచునే వుండడమా అని అలోచిస్తూనే వుం దింకా.

సరిగా, యీసమయంలో పది పద్దెనిమిదేళ్ళ వితంతువొకామె, వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ, ఎక్కడ దాటిపోతుందో అన్నట్టు కొంచెం వడిగా వచ్చింది.

వచ్చి, రేవులో ఆడవాళ్ళెవరూ లేనందుకు సంతోషించి "మహాబాగా దొరికా" వన్నట్టు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ జానకమ్మ దగ్గిరికి వెళ్ళి "నీపే రెవరమ్మా?" అని మెల్లిగానూ లాలనగానూ అడిగింది.

"జానకమ్మండీ పిన్నిగారూ" అని బదులు చెప్పింది జానకి, గునుస్తూ.

"మాటే ఆడదేమో" అనిజంకుతూ వచ్చిన వితంతువు యీ మాటలో వున్న చెలికారం గుర్తించి పొంగిపోయి "నేను నీకు పిన్నిని కాను తల్లీ" అంటూ వాత్సల్యం కనపరచింది.

"మరే మవుతారు?"

"తోడబుట్టినదా న్నమ్మా"

ఇది విని జానకి చకిత అయింది.

"నెత్తిమీద పెట్టుకునేవాళ్ళూ, గారాంచేసేవాళ్ళూ లేని యింటోపడి మగ్గి పోతూ వున్న దురదృష్టవంతురాలిని, కనక, దయివుంటే అక్కయ్యా అని పిలు తల్లీ!"

ఈమాట, ఆవితంతువు, నాలుగు వేపులా చూస్తూ బెదురుతూ బెదురుతూ గద్గదికతో అంది.

"అయితే, మరీసంతోషం. నాకు చెల్లెళ్ళేకాని అక్కలు లేరు. మిమ్మల్నే అక్కగా చూసుకుంటా నండీ"

"అలా అయేటట్టుంటే ఇక మీరనడంయెందుకు, మరీ?"

ఈవాత్సల్యానికి పొంగిపోయి, చిరునవ్వు నవ్వుతూ "నిజమే కాని కొత్తకాదూ?" అనడిగింది జానకి.

"నిన్ను నువ్వన్నాను కాదూ నేనూ?"

"అన్నారు, అంటున్నారు, నిజమేనండీ—"

"అదిగో మళ్ళీ అదేమాట"

"అదే చెబుతున్నాను. నువ్వంటే ను వ్వనుకోడం బాగానే వుంటుంది. నాకిష్టమే కూడానూ; కాని పాతపడేదాకా కొత్తవాళ్ళని నువ్వనడం యెట్బెట్టుగా వుంటుంది"

"అక్కకీ చెల్లెలికీ కొత్తయేమిటమ్మా వెర్రితల్లీ! పోనీ యింతకీ వొప్పుకున్నావుగదా?"

"ఆ"

ఇలా అన్నప్పుడు జానకి లోలకులు కొంచె వూగీసలాడ చకచ్చక లీనాయి.

ఆచకచకలు ఆమె బుగ్గలమీద లాస్యం చేశాయి.

ఆ బుగ్గలు చూసి ముగ్ధురా లయి, ఆవితంతువు, మమకారంతో ఆబుగ్గలు పుణుకుతూ "వొసే అక్కయ్యా అను. ఏం, అంటావా?" అంటూ గునిసింది.

"వొసే?"

"అవును. ఏంతప్పూ? మనం క్షత్రియులం కాముగా?" జానకి మిడుతూ మిడుతూ చూసింది.

"మీచెల్లెళ్ళు నిన్ను వొసే అనరా యేమిటమ్మా?"

"అంటారు; కాని మీ రెందుకన్నారు కాదు మరీ?"

"నాకూ అలవాటు లేకే"

"ఇంకే?"

"జరిగిపోయినదాని కేంగానీ— యిది మొదలు వొసే అంటే వొసే అనుకుందాం మనం. ఏమే చెల్లాయీ?"

ఇలా అడుగుతూ ఆవితంతువు జానకమ్మ జబ్బలు పట్టుకుని వూపేసింది.

అవ్యక్తానందంతో జానకి "సంయే" అంది.

అందుకు చాలా సంబరపడి "యేదీ, వొక్కమాటల్లా పిలూ" అంటూ ముచ్చటపడింది వితంతువు.

వెంటనే "నీ పేరెవరే అక్కయ్యా?" అనేసింది జానకి.

కానయితే, యీ ప్రశ్నలో వుండవలసినంత చనువు లేకపోగా, కొంచెం సంకోచం కూడా కనపడింది. అయినా అందుకే బ్రహ్మానందపడిపోయి "హాయి హాయి! నువ్విలా పిలిస్తే నా ప్రాణాలు లేచివస్తున్నాయి. నాకళ్ళకి కొత్తవెలుగు కనపడుతుంది" అంటూ మురిసిపోయింది వితంతువు.

"మరి నీ పేరేమిటీ?" అన్నట్టు చూసింది జానకి.

"అన్నట్టు నా పేరడిగావు నువ్వు పాపం! నా సంబరంలో నే నామాట మరచేపోయాను. నాపేరు రంగనాయికమ్మ" అంది వితంతువు, జానకి యింగితం గుర్తించి.

ఇది విని యేదో జ్ఞాపకం చేసుకుంటున్నట్టు పక్కవాటుగా కిందికి చూసింది జానకి.

"నీతో మాట్లాడాలని నెల్లాళ్ళనుంచి దోరిపోతున్నాను నేను. నువ్వూ వారూ కూడా చద్దన్నం తింటారు కనక,—"

అర్థోక్తి ఆగిపోయి "చెల్లీ, వొక్కమాట................అడగనా?" అని గుటకలు మింగింది రంగనాయిక.

"అడగవే" అనేసింది జానకి; కాని "యేమడుగుతుందో బాబూ?" అని అంతలో సంకోచపడింది.

దీనికి సాయం ముసిముసినవ్వులు నవ్వుతూ వొక్కమాటు కళ్ళల్లోకి గంభీరంగా చూసింది రంగనాయిక.

దాంతో సంకోచమూ బలపడి, వెంటనే ఉబలాటమూ పొటమరించగా, విలంబం సహించలేక "అడగవేమే?" అని ముదలకించింది జానకి.

"నువ్వూవారూ యేకబంతేనా?"

"వోస్. అదా?"

ఇలా అని అవ్యవహితంగా నవ్వేసింది జానకి.

"అవునా? ఏమే చెల్లీ?"

"మరి — మరి — కూచునీదాకా వొదలరుకదా, యేం చెయ్యమంటావే అక్కయ్యా?"

"యేమిటో యెందుకు చెయ్యాలి చెల్లీ, పెళ్ళికూతురులాగ ల—క్షణంగా కూచోక? నువ్వంటే యెంత ప్రేమా లేకపోతే వారలా పట్టుపడతారు?"

"అంచేతే, యెదురుచెప్పలేకపోతున్నానే"

"తప్పుతప్పు యెన్నడూ యెదురు చెప్పకమ్మా"

"............................"

"అంత ప్రేమ చూపిస్తున్నందుకు వారి నోటికి గోరుముద్దలందించినా రుణం తీరదు, తెలుసా?"

ఇది విని సిగ్గుపడ మురిసిపోయి, జానకి వూగిపోయింది.

"నేను చాలామాట్లు చూశాను. చెప్పకుంటే సిగ్గు. ఏమైనసూరుపాకో, ఏమితాయో రహస్యంగా తెచ్చి మాచిన్నన్నయ్య ముచ్చటపడుతూ మాచిన్న వదిన నోటికందించబోతాడు; కాని, గుర్రాలక్కలాగ మొగం తిప్పేసుకుని, ఆవిడ, చెయ్యి చాపుతుంది"

"అయ్యో" అంటూ బుగ్గలు నొక్కుకుంది జానకి.

"అయ్యోఅంటే? ఎక్కడకయినా వెళ్ళవలసివచ్చినప్పుడు మా అన్నయ్య వెంట నడవడానిక్కూడా ఆవిడకు సిగ్గేట"

"అదేం వులకమే మాప్మా?" అంటూ సాగతీసుకుంది జానకి.

"పుట్టుకతో రావాలిగాని నేర్పితే వస్తాయిటే ముచ్చట్లూ మురిపాలూనూ? ఎంత అదృష్టం వుంటే పెళ్ళానికి తగ్గ మొగుడూ మొగుడికితగ్గ పెళ్ళామూ దొరకనూ?"

చూసిచూసి, తలుచుకుని తలుచుకుని, మురిసి మురిసి చివరికి "చద్దన్నా లప్పుడే అలాగ. మధ్యాహ్నమూ రాత్రీ వారికే ముందు వడ్డించేస్తానుసుమా" అంది జానకి. కళ్ళు తిప్పుకుంటూ.

"ఇంతకీ; చెప్పవచ్చిం దేమిటంటే?" అంటూ మళ్ళీ అసలుసంగతి అందుకుంది రంగనాయిక.

జానకి చెవులోరజేసుకుంది.

2

"మీ రిద్దరూ కూడా చద్దన్నం తింటారు కనక, నువ్వు పొద్దెక్కివస్తావు గదా అని దినమ్మా నేనూ అలాగే వస్తున్నాను. అయినా, నువ్వెప్పుడోకాని తారసపడ్డమే లేదు. తీరా తారసపడ్డనాడు ఆసమయాని కెవరో వుంటున్నారు"

"ఉంటేం?"

"ఇన్నాళ్ళ కివాళ లేచినవేళ మంచిది"

"ఒక్కమా టయినా చెప్పారుకారేం?"

"అదిగో, మళ్ళీ మీరంటున్నావే"

"ఇంకా నలగలేదుకాదుటే మరీ?"

"అవునమ్మా, అవును"

"కొన్నాళ్ళదాకా మీ రని వొకమాటూ, ముభావంగా వొకమాటూ, నువ్వని వొకమాటూ —"

"అదీ వొక అందమేలే"

"......................"

"మాసోమిదేవి అక్కయ్యని సాగనంపుతూ దొడ్డితలుపు తీశాటప్పటికి నువ్వొకనపడ్డావు. కాళ్ళు గబగబలాడిపోయాయి. ఇక నుంచోలేకపోయాను. అక్కయ్యతో చెబుతూ చెబుతూ వున్నమాట గభీమని తుంచేసి, గెంటేసినట్టు దాన్ని బలవంతాన పంపేసి, వొక్క అంగలో లోపలికి వెళ్ళి బిందెపుచ్చుకు వచ్చేశాను"

"ఆవిడ యేమనుకున్నారో పా-పం"

"ఏమనుకుంటుం దేమిటి? ఏమిటో అనుకుంటే మాత్రం యివతలివాళ్ళు తమ పని మానుకుంటారా యేమిటి? ఇక్కడికి నెళ్ళాళ్ళనుంచి అటమటించి పోతూ వుండగా యివాళ దొరికావు కదా నువ్వు —"

"ఆవిడకు తెలుసా?"

"అమ్మో, తెలుసునేం? దేవుడికయినా తెలుసునేం? వాళ్ళకి వాళ్ళకి తెలిసేవుంటే వొంటిగా దొరక్కపోతావా అని నీకోసం కనిపెట్టుక్కూచోడం యెందుకే?"

"నిజమే నిజమే. నిన్ను చూసినప్పు డల్లా మాట్లాడించాలని నాకూ వుబలాటంగానే వుంటోంది; సాహసించ లేకపోతున్నాను. ఆవేళా? .... రాజేశ్వరస్వామి గుళ్ళోనూ? ....ప్రదక్షిణం చేశాటప్పు డొకమాటు పక్కపక్కగా వచ్చాం జ్ఞాపకం వుందా? అప్పుడు ఏమయినా సరే పలకరిం చేద్దా మని —"

"అప్పుడు నువ్వు పలకరించినా పలక్కే పోదును. ఆవేళ నేను బుద్ధి పూర్వకంగా మూగనోము పట్టేశాను"

"ఏం?"

"వెనకాల మాఅమ్మ —"

"తెల్లగా ముగ్గుబుట్టలాగ తలా ఆవిడా —"

"ఆవిడ మా పెత్తాతగారి కూతురు. మా వెంకు సోదెమ్మత్తయ్య. ఆవిడ పక్కనీ —?"

"బచ్చలిపళ్ళరంగు పట్టుచీర కట్టుకున్నారూ —?"

"ఆ, ఆవిడే మా అమ్మ"

"చెరువుదగ్గిర చాలామాట్లు కనపడ్డారు, ఆవిడా దొడ్డమ్మగారు?"

"మరే"

"నీళ్ళు ముంచిపెట్టి, ఆవిడ నాకోనాడు బిందె బుజానికెత్తారు తెలుసా?"

"అదెప్పుడే?"

"పద్దినాలు కాలేదింకా. అప్పుడే తలఅంటుకోడంవల్ల చెర్లో నీళ్ళు పోసుకో వలసిన అవసరం లేకపోయింది. పైగా పట్టుచీర కట్టుకువచ్చాను. పావంచాల కింద చేపలు ముసురుకుంటూ వుండడంవల్ల అక్కడి నీళ్ళు ముంచడానికిష్టం లేక — పోనీ అంటే చెర్లో దిగడానికి వీల్లేక—"

"వోహో, అలా జరిగిందా?"

"అడగాలనీ అనుకున్నాను; కాని, తీరా, అడిగితే ఏమనుకుంటారో బాబూ—"

"మాఅమ్మ అలాంటిది కాదు సుమా"

నాఅవస్థ చూసి జాలిపడ్డారు కామోసు పాపం "నే ముంచిపెడతాను తేవే అమ్మాయీ—"

"నువ్వేం చేశావు?"

"నేనేమీ చెయ్యకపూర్వమే-అనకముందే వొడ్డుకి వచ్చి బిందె పుచ్చుకు న్నారు. "ఇలా అందించండీ" అంటూవున్నా పైకెక్కి వచ్చి బుజాని కెత్తి వెళ్ళి మళ్ళీస్నానం చేశారు."

"ఒక్కొక్కప్పుడు తిక్క తిప్పుకోలేదు; గాని వొకళ్ళకి సాయం చెయ్యడం అంటే మాఅమ్మ కెంతో సరదా"

"మొత్తానికి, నీమొగం చూశాటప్పటికి యెక్కడో చూసినట్టు మాత్రమే కాదు, కొన్నాళ్ళపాటు వొకచోట కలిసే—"

"దృఢమైన ఋణానుబంధం యేదోవుంది మనకి. వెనకటి జన్మలో యిద్దరమూ వొక్క కడుపున పుట్టివుంటాం"

"నాకూ అలాగే తోస్తోంది"

ఇంతలో అలికిడి కాగా రంగనాయిక వెనక్కి చూసింది

కుయ్యొ కుయ్యొ దగ్గుకుంటూ తూలుతూ తూలుతూ ఆబ్రాహ్మడు వెళ్ళి పోతున్నాడు.

వెంటనే "యిక రావే" అంటూ ముందు రంగనాయిక యేనుగుగున్న లాగ బయలుదేరగా "పదవే" అంటూ హంసపిట్టలాగ జానకమ్మ వెనకాల అనుసరించింది.

3

హఠాత్తుగా కలిసిన యీ స్నేహాని కాశ్చర్యమూ, వొక్కమాటే దృఢపడిపోయిన యీ చుట్టరికాని కానందమూ, వీటి మూలంగా పుట్టిన నునుసిగ్గు దొంతరలూ— ఇవి వారి నిద్దర్నీ నీరవులను చేసేశాయి.

దాంతో, చివరి పావంచా మీదికి వెళ్ళేదాకా రంగనాయిక వెనక్కి తిరిగి చూడలేకపోయింది.

జానకమ్మ కూడా ఈపక్కకీ ఆపక్కకీ చూస్తూనే నడిచింది.

చివరిపావంచామీద కూడా ఒక్కక్షణం వారలాగే నుంచున్నారు; కాని యింతలో యెవరయినావచ్చి యేకాంతం చెడగొడతారన్న ఆదుర్దాతో "రావే చెల్లీ" అంటూ ముందు రంగనాయికా "యీతాలాడడం నీకు చేతవునుదే అక్కయ్యా?" అనడుగుతూ వెనకాల జానకీ చెర్లో దిగారు.

"నీకు చేతవునా?"

"ఆ"

"మాతల్లే, ఎప్పుడు నేర్చుకున్నావమ్మా?"

"చాలా దినాలయింది. ఏమీ కష్టం లేదే అక్కా?"

"ఎవరు నేర్పారూ?"

"మా చిన్నన్నయ్య"

"ఈ చెరువంతా యీదగలవా?"

"హ-మ్మో" అంటూ గుండెలు నొక్కుకుంది జానకి.

అప్పటికప్పుడే యిద్దరూ గుండెలలోతుకి వెళ్ళారు.

వెళ్ళివెళ్ళడంతోటే యిద్దరూ అభిముఖంగా తిరిగారు.

అప్పుడొక్కమాటు కంఠందాకా మునిగి లేచి "వొక్కమాటు కౌగలించుకో నివ్వవుదే చెల్లాయీ?"అని ప్రాధేయపడుతూ రంగనాయిక చేతులు చాపింది.

ఈమాట జానకమ్మకి నిర్భరానందం కలిగించింది.

వెంటనే ఆమెకూడా చేతులుచాచి ముందుకి వెళ్ళింది.

ఒక్క క్షణకాలం ఒకరిచేతుల్లో వొకరు — వారిద్దరూ వెన్నలా కరిగిపోయారు.

ఆవొక్క క్షణంలోనూ వారిద్దరూ కామమూ ప్రణయమూ కలిసిపోయినట్టూ, సౌఖ్యమూ ఆనందమూ మిళావయిపోయినట్టూ, స్వర్గలోకమూ సత్యలోకమూ మిళితమయినట్టూ, జీవాత్మా పరమాత్మా ఐక్యమయిపోయినట్టూ వున్నారు.

తరవాత రంగనాయిక "యేడుపు వస్తోందే" అంటూ కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుని గద్గదికతో "చెల్లీ" అని పిలిచింది.

"ఆ"

"..................."

"ఎందుకే అక్కయ్యా?"

"ఈదయ బతికివున్నంతకాలమూ—"

ఇంతవరకూ అన్నాక, పెదవులు రావిరేకల్లాగ వొణికిపోగా రంగనాయిక మరి మాట్లాడలేక పోయింది.

"అదేమిటే అలా అంటావూ? నీదయ లేకపోతే నేను మాత్రం బతగ్గలనుటే?" అనడిగింది జానకి.

ఇలా అడిగినప్పుడు జానకి కళ్ళున్నూ చెమ్మగిల్లాయి.

"ఏదీ, చేతిలో చెయ్యి వెయ్యి" అంటూ రంగనాయిక చెయ్యిచాపగా, జానకి ఆచయ్యి గట్టిగాపట్టుకుంది.

ఇంతలో దూరాన మాటలు వినపడ్డాయి.

ఎవరో చెరువుకే వస్తున్నట్టు కనపడింది.

ఉలిక్కిపడి వారిద్దరూ యెడంయెడంగా జరిగారు.

ఇదయేటప్పటికి, వొక వెలమయువతి యెవరిమీదో రుంజుకుంటూ వచ్చి, బిందె ముంచుకుని గబగబా చక్కాపోయింది.

"నీతో మాట్లాడా లనీ - " అంటూ మళ్ళీ అందుకుని రంగనాయక జానకి దగ్గిరగా వెళ్ళింది.

"నీతో జతగా వుండా లనీ, నిన్ను చెల్లాయీ అని పిలిచి నీచేత "వొసే అక్కయ్యా" అని పిలిపించుకోవాలనీ నేను తల్లడిల్లిపోతున్నాను. నీతో మాట్లాడ్డానికి వీలుకాక నాహృదయం దహించుకుపోతోంది. ఈజన్మకీసౌభాగ్యం అయినా దొరకదేమో అని యింటికి వెళ్ళాక తలనొప్పిగావుందని వంక పన్ని గదిలో పడి దొర్లిపోతూ కుమిలికుమిలి యేడుస్తూ వుంటాను"

ఏమనాలో తోచక జానకి తలవూపి వూరుకుంది.

"ఎవరితో నయినా వెళ్ళబోసుకుంటే యీబాధ కొంత అయినా తగ్గి వుండును; కాని నోరు విప్పడాని కిష్టంలేకుండా వుంది, విప్పలేకేపోతున్నాను."

జానకి మళ్ళీ తలవూపింది.

"ఇలాగ వున్న దుఃఖం వున్నట్టే వుండగా కొత్తదుఃఖం వచ్చి యెప్పటి కప్పుడే గుండెల కెగతన్నుతోంది. చెల్లోయ్! చెబితే నమ్మవు. నటన అనికూడా అనిపిస్తుంది; కాని నేనొక్కొక్కప్పుడు మరణవేదన — "

రంగనాయిక యిలా అనేటప్పటికి జానకి హృదయం గుబ గుబలాడి పోయింది.

వెంటనే "యిక చెప్పకే అక్కయ్యా, నేనా మాటలు వినలేనే, చెబితే నన్ను చంపుకుతిన్నట్టే. నాకాళ్ళల్లో వొణుకు పుడుతోందే" అంటూ ఆమె రెండుచేతులూ పట్టుకుంది జానకి.

రంగనాయిక దీంతో పూరట చెందింది. కాని జానకి కళ్ళు చూసి నిలవ లేక "నువ్వుకూడా యేడుస్తున్నావే! మా తల్లివి కాదూ? ఊరుకోమ్మా!" అంటూ తనచేతులు విడిపించుకుని, యెడమచేత ఆమెని పొదివిపట్టుకుని కుడిచేత ఆమె గడ్డం పుణుకుతూ బతిమాలింది.

ఇద్దరికీ మనస్సులు తేరుకున్నాయి.

జానకి యేదో అనపోగా అడ్డువచ్చి "యేది యేమయినా నువ్వు నాకు చెల్లెలివయినావు. నన్ను అక్కగా చూసుకుంటా నన్నావు. ఇక నాకేం లోటూ? ఇలాగయినా నువ్వే నే నని తృప్తిపడడానికి దేవుడు మార్గం చూపించాడు" అంటూ ఆమె కణతలమీద మెటికలు విరిచింది రంగనాయిక.

4

ఈసమయంలో, అతివయ్యారంగా వొక దేవాంగిరమణివచ్చి "వేసవి కాలం అయితేమాత్రం చెర్లోదిగితే చలికాదుటండీ?" అనడుగుతూ బిందె ముంచుకొని! జవాబు కోసం వొక్కక్షణం చెవు లోరజేసుకుని వుండి, చివరికి నిరుత్సాహపడి "ఎరక్కపోయి పలకరించా" నని విసుక్కుంటూ చక్కా పోయింది.

ఆమె హఠాత్తుగా వచ్చినందు కులిక్కిపడి, మళ్ళీ వెంటనే వెళ్ళిపోయి నందుకు దిటవుతెచ్చుకుని "ఇవాళ యేకాదశి" అంటూ రంగనాయికా "నిన్ననే స్నానం" అంటూ జానకీ జారుముళ్ళు విప్పుకుని, పల్లెవాడు వలవేసినట్టు కేశ పాశాలు నీటిమీదికి విసిరేసుకున్నారు.

దాంతో, చెరువంతా నాచు కమ్మిన ట్టయిపోయింది.

తరవాత, అంత లోతున వుండిన్నీ చేతులతో నీళ్ళు చల్లుకునే స్నానం చేసి అతికష్టంమీద మళ్ళీ వారు జారుముళ్ళు వేసుకున్నారు.

ఇదయిన తరవాత, అప్రయత్నంగా యిద్దరూ మొగాలు వంచుకున్నారు.

మళ్ళీ వొకర్నొకరు చూసుకున్నారు.

జానకిచూపుల్లో "వెళ్ళిపోదాం" అన్న భావం మెరిసింది.

అది గుర్తించి కంగారుపడి "మొదట నన్ను మీవారి కివ్వడానికి నిరు కయింది" అంటూ అసలుగొడవ యెత్తుకుంది రంగనాయిక.

"ముహూర్తం వుంచడం కూడా జరిగిపోయింది"

"మరెందుకు తప్పిపోయిందీ?"

"నాఅదృష్టం మంచిది కనక"

ఈమాట అన్నప్పుడు రంగనాయిక యెంత నిశ్చలంగా వుందో, విన్నాక జానకి అంత చకితురా లయిపోయింది.

"ఏం అలా అయినావేం?" అనడిగింది రంగనాయిక.

"నీఅదృష్టం — "

"అవును, నాఅదృష్టం మంచిది కనకనే నేను మోడునయిపోయినా వారిని కళ్ళతో చూసుకుంటూ అయినా ఆనందించడానికి పెట్టిపుట్టాను కనకనే"

ఇది విని జానకి వొకవిధంగా తెప్పరిల్లింది.

"పెద్దదాన్ని కాకుండానే నాకీ దుర్గతి పట్టే యోగం రాసివుంది. నాకు పైసంబంధం అయింది కనక, వారు బతికి వున్నారు"

జానకి మిడుతూమిడుతూ చూసింది.

"మీవారి విలవ నాకు తెలిసిన ట్టెవరికి తెలుసూ? పక్క పాపడి తీసు కుని, వుత్తరీయం జందెప్పెట్టుగా వేసుకుని వారు కనపడితే "అదృష్టవంతులు" అనుకుంటూ నేనెంత పొంగిపోతానో యెవరెరుగుదురూ?"

"అపాపిడి నేను దిద్దుతా నని యెరగదు అక్కయ్య" అనుకుని నవ్వు కుంది జానకి.

అలా సూర్యోదయం అయేటప్పటికి అతనిలా స్నానంచేసి పొడిబట్ట కట్టుకుని దక్షిణపువసారాలో కుర్చీపీట మీద కూచుంటాడు.

అద్దం చేతికిచ్చి యెదుటనుంచుని జానకి తలదువ్వుతుంది.

ఉండుండి అతను కదలాలనే కదులుతాడు.

"ఉండండి, కదలకండీ, అలా—అలా—సడే వంకరవచ్చింది. ఇలా అయితే పాపిడీ దిద్దడం నావల్లకాదు బాబూ" అంటూ ఆమె మూతి ముడుచు కుంటుంది.

"పొరపాటే కాని, యెరక్క చేశాను. ఇక కదిలితే అడుగు. మాట తిరిగితే బుగ్గ కొరకెయ్యి" అని అతను క్షమాపణ చెప్పుకుంటాడు.

ఒకటిరెండు నిమిషాలు ఇలా సరాగాలు జరిగి, చివరికి రాజీ అయి పోతుంది.

ఇలాగ, దినాని కొక విధంగా నడుస్తుంది కథ.

జానకమ్మ కదంతా జ్ఞాపకం వచ్చింది.

దాంతో, ఆమె మొగం వికసించింది.

అది గుర్తించి, కొంటె చూపులు చూస్తూ "నువ్వేనా తలదువ్వడం? .... ఏమే చెల్లీ?" అంటూ బెల్లించింది రంగనాయిక.

సిగ్గూ ఆనందమూ పెనవేసుకుని జానకి మొగం పక్కకి తిప్పేశాయి.

"నువ్వే దువ్వేతావు, నాకు తెలుసు. అది నీపనే కాకపోతే వారంత తిన్నగ పాపిడి దిద్దుకోగలరేం?" అంటూ మళ్ళీ బెల్లించింది రంగనాయిక.

"మరి – మరి ఇప్పుడింత సంతోషించేదానవు, అప్పుడు మీవాళ్ళు మరో సంబంధం తెస్తే నువ్వెందు కంగీకరించావూ?"

"నాకర్మం కాలిపోతే, నేనంగీకరించి వూరుకున్నా ననుకున్నావా యేమిటే? అప్పుడేం జరిగిందో యెరుగుదువా మరి?"

"ఏం జరిగిందమ్మా?"

"ఎంతయినా జరిగింది. ఇంతకీ ఆస్తి యేమాత్రమో—"

"జమీందారులా?"

"సడే? ఏటా ఆరువందలు వస్తాయిట"

"ఊహూ" అంటూ పక్కకి చూసింది జానకి.

"మీఆయనకి మూడువేలు వస్తాయి, నేనెరగనా?"

జానకి మొగాన గర్వరేఖ తళుక్కుమంది. అది మాటు చేసుకుంటూ "పోనీ, చదువు?" అనడిగిందామె.

"ఇంటర్‌మీడియేటేగా? మీఆయన బి. ఏ. చదువుతున్నారు. ఆకోతి, డాక్టరు పరీక్ష – "

"కోతా?"

"కోతయినా నయమే, చూడూ, నిడదవోలు స్టేషన్లో వుంటాయీ ....?"

"కొండముచ్చులా?" అనడిగింది జానకి చకిత అయి.

"అవయినా కొంత నయమే. వాటికి మొగమే నలుపు"

తనభర్త సొగసు కళ్ళకు కట్టినట్టయింది జానకమ్మకి.

మళ్ళీ ఆమె కళ్ళు మెరిశాయి; కాని మాట మార్చెయ్యదలిచి "అన్న దమ్ములెందరూ?" అనడిగింది.

"ఆరువందల సౌభాగ్యానికి వాటాలు కూడాకావాలా యేమిటమ్మా?"

"ఆరువందలతో కూచుంటారా యేమిటే? డాక్టరైనాక దోచెయ్యడ మేగా?"

"దోచేస్తూనే వున్నాడుగా?"

జానకి నవ్వు ఆపుకోలేకపోయింది.

రంగనాయికా నవ్వింది.

"శాబాసు, ఆసంబంధం యెలా తెచ్చారే మీవాళ్ళు?"

"తెచ్చివూరుకున్నారా? యజ్ఞయాగాలుచేసిన కుటుంబం అంటూ పొంగి పోయాడు మానాన్న. "నిక్షేపంలావున్నాడు. నలుపయితేయేం? కష్టమూర్తి యెరుపా యేమి" టంది మాఅమ్మ. "రాచ కుమారుడులా వున్నాడు పెట్టి పుట్టా" వంది మాపెద్దవదిన. "ఒక్క సంవత్సరంలో పెద్ద డాక్టరయి పోతాడుట" అంది మాచిన్నవదిన"

"నువ్వు—"

"కిటికీలోనుంచి చూసి తలతిరిగి కూలబడి పోయాను. అదేమిటో యెర గని మాఅమ్మ నన్ను పొదివిపట్టుకు తీసుకువెళ్ళి కూచోబెట్టింది"

"రామరామా"

"కూడా వచ్చిన ముసిలా దేమిటో అడిగాడు. నేను మాటాడలేదు. "పాడగలవా?" అన్నా డాపిల్లాడు"

"తను పాడతా డటనా?"

"మరే, అదే తక్కువ....అప్పుడు నే నేం చేశానో—"

"చెప్పవే అక్కయ్యా"

"మొగం వంచుకున్నాను, అది చాలక కళ్ళు మూసుకున్నాను. అదీ చాలక నోరు కుట్టేసుకున్నాను. అయినా డోకువస్తున్నట్టయి ఉవ్వెత్తుగా లేచి —"

"అయ్యో!"

"అయ్యో?"

"అవునవును తప్పే. నువ్వు మంచిపనిచేశావు. అయితే, అప్పుడయినా వాళ్ళు గ్రహించుకున్నారా?"

"సిగ్గూబిడియమూ వుంటేనా గ్రహింపుశక్తి వుండడానికి? వెయ్యిరూపా యిలూ అప్పుడే పుచ్చుకుని, తాంబూలాలు కానిచ్చేసుకుని—"

"ఛీ, వాళ్ళ నేంచేసినా పాపం వుందా?"

"ఎవళ్ళనీ?"

"అవునవును, మీవాళ్ళనే"

"అలా అన్నావు బాగుంది. ఆపిల్లాడు నాకు వద్దని నెత్తీ నోరూ బాదుకున్నాను. రెండుదినాలు వచ్చి మంచి నీళ్ళు కూడా పుచ్చుకోలేదు. పెళ్ళికూతుర్ని చేశారు. ఏడుస్తూనే వున్నాను. పీటలమీద కూచోపెట్టారు. ఏడుస్తూనే వున్నాను"

"అయ్యో"

"అయ్యో" అంటే పండువంటి పెనిమిటిని సంపాదించుకున్నావు. నాయాతన నీకిప్పు డేం తెలుస్తుంది చెల్లీ?"

రంగనాయిక యిలా అడిగాటప్పటికీ, జానకమ్మకి మిలమిల మెరసిపోతూ మొగుడు ఎదట నుంచున్నట్టనిపించింది.

అతణ్ణి చూసి వూళ్లోవున్న మిటారికత్తెలందరూ గుటకలు మింగుతున్నట్టున్నూ కనపడ్డింది.

5

దీనికి సాయం, మొన్న మొన్ననే — అంటే యిరవై దినాల కిందటే వొక తమాషా జరిగింది.

వేణుగోపాలసిద్ధాంతిగారి పెద్దకొడుకు మూడోకూతురికి పెళ్ళి.

వీరు నాలుగువేలు వరదక్షిణా, అయిదువందలు లాంఛనాలూ యిచ్చారు.

వారు రెండుబోగంమేళాలతోటీ, కవిగాయకులతోటీ ఆడా మొగ - పిల్లామేకా - పదమూడు బస్సులమీద వచ్చి, అయిదు వేలు నగలు పెట్టి ఝామ్మంటూ సదస్యం చేశారు.

వారిలో వొక యువతి అచ్చంగా జానకిలా వుంది.

హఠాత్తుగా చూసి, పార్వతీశం, ఆమె జానకమ్మే అనుకున్నాడు; కాని ఆమె కట్టుకున్న చీరవంటిది, జానకమ్మకే కాదు, ఆవూళ్ళోనే యెవరికీలేదు.

ఇంటికి వచ్చాక జరిగిం దంతా చెప్పా డతను.

ఏదో గొప్పవిషయం కనిపెట్టినవాడిలాగ మహా పొంగి పోతూ చెప్పాడతను.

వినివిని మొదట జానకమ్మకూడా వింతేపడిం౦ది, కాని చివరికి "ఆచీర చూశారు కదా మరి నేనే అని యెలా అనుకున్నారండీ?" అనడిగింది, కొంచె చూపులుచూస్తూ.

ఈమాట కొరడా కొస లాగ తగిలిం దతనికి.

"అన్నా, మాజానకి లా వుంటావా?" అని ఆపిల్లమీద పుట్టిన స్పర్థ ఆతనికి కసిగా మారిపోయింది.

వెంటనే రాజమంౘ్రీ ప్రయాణం కట్టాడు.

అక్కణ్ణుంచి మద్రాసే వెళ్ళిపోయాడు.

సదస్యంనాడు, ఉభయపక్షాలా, ఎక్క డెక్కణ్ణుంచో మరికొందరు చుట్టాలు కూడా వచ్చారు.

"వారు, రాలేదు కదా, సదస్యానికి వెళ్ళడమా మానడామా" అని అను కుంటూనే, చీర కట్టుకోడం తరవాయిగా, తలదువ్వుకోడం వగైరాలన్నీ పూర్తి చేసుకుని వుంది జానకి.

ఇలాంటి స్థితిలో రెండుచీరలు పట్టుకుచక్కా వచ్చాడు పార్వతీశం.

"అయ్యో, రెండెందుకు తెచ్చారండీ యిప్పుడూ?" అని జానకి సాగతీసు కుంది; గాని అతను చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

దానిమీద కొంచెం వాగ్వాదం జరిగింది.

చల్లాబడింది.

అప్పుడు "ఇవాళ కిది కట్టుకో" అని వాటిలో వొకచీర అందించా డతను.

మురిసిపోతూ యిద్దరూ వెళ్ళి చూస్తారు కదా, ఆపిల్లకూడా సరిగా అలాంటిచీరే కట్టుకుని తయా రయింది.

తాను తీసికట్టు అయిపోయినందుకు జానకి వుషారుగానే వుంది; గాని "మించలేక పోయానే" అని అతను చాలా కించపడ్డాడు.

ఇది యిలా జరుగుతూ వుండగా ఉభయపక్షాలా వచ్చిన ఆయీడు పిల్ల లందరూ సదస్యం విడిచిపెట్టి ఆయిద్దరి చుట్టూ మూగారు.

అది గుర్తించుకుని "పల్లెటూరిదానవు నీకెంతవేషమే?" అన్న ట్టాపిల్లా; "నీపట్నవాసం యెగురుపాటు ఈపాటికి చాలంచవో ఓవిడా" అన్నట్టు జానకీ కోరచూపులు చూసుకున్నారు.

ఇంటికి వెళ్ళాక జగిరిం దంతా చెప్పి జానకి పార్వతీశాన్ని పువ్వులతో పూజించింది.

అయినా అతనకి తృప్తి కాలేదు.

మళ్ళీ రాజమంౘ్రీ వుడాయించాడు.

మళ్ళీ రాత్రి పదిగంటలకే యింటికి వచ్చాడు; గాని యెంత అడిగినా వెళ్ళిన కారణమూ చేసుకువచ్చిన పనీ మాత్రం జానకమ్మకి చెప్పలేదు.

మర్నాడు సాయంత్రం బంతులాడింపు చూడ్డానికి పిలుపు వచ్చింది.

జానకి బర్మాముడి వేసుకుంది; గాని పార్వతీశం అది విప్పించేసి స్వయంగా వాలుజడ వేశాడు.

కనపడీ కనపడనట్టు కాటుకతో కనుబొమ్మలు దిద్దాడు.

బ్రహ్మకయినా తెలవకుండా వుండేటంత నాజూగ్గా చెక్కిళ్ళకి చెర్రీ పౌడ రద్దాడు.

రవ్వల లోలకులు తీయించేసి జేబులోంచి తీసి చక్రాల లోలకులు పెట్టాడు.

ఇది యిలా జరుగుతూ వుండగానే ఆమె పెదవులు తాంబూలరాగ రంజితా లయినాయి.

తరవాత, ఆమె, అతను చెప్పకపూర్వమే రెండోచీర కట్టేసుకుని, తలలో మల్లెపువ్వులగుత్తి అమర్చుకుని, నిలువుటద్దం యెదుట నుంచుని యెగాదిగా చూసుకుని "మారిపోయానండీ" అంటూ నెమలి కేక వేసింది.

ఇద్దరూ ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వెళ్ళారు.

పెళ్ళికూతురి తండ్రి పార్వతీశాన్ని మేజువాణీలోకి, పెళ్ళికూతురు అక్క జానకిని బంతులాడింపుదగ్గిరికీ తీసుకువెళ్ళారు.

తొలీనాడు జరిగింది తలుచుకుని ఆపిల్లకూడా మాంచి తయారీలో వచ్చింది; కాని అన్నివిధాలా జానకి యెదుట వెలవెలపోయింది.

తొలీనాడు ఇద్దరి చుట్టూ మూగిన పిల్లలందరూ ఆవేళ వొక్క జానకి చుట్టూ మూగి వూరుకున్నారు.

దీంతో, ఆపిల్ల, కొట్టినంత బాధపడి యెవరికీ చెప్పకుండా విడిదిలోకి చక్కాపోయింది.

ఇదంతావిని ఆవేళ రాత్రి పార్వతీశం బ్రహ్మానంద పడిపోయాడు

తాను కోరకపోయినా, నిమిషాలమీద అలాంటిచీరలు తెచ్చినందుకూ— రెండు తెచ్చినందుకూ — చక్రాలలోలకులున్నూ తెచ్చి కొత్తఅందం సంఘటించి నందుకూ పడిపడి దణ్ణాలు పెట్టి జానకి అతని చేతుల్లో కరిగిపోయింది.

ఇది కూడా ఆమె కిప్పుడు జరుగుతున్నట్టనిపించింది.

దాంతో "అంతచేసినా మీవాళ్ళు మానలేదూ?" అని కొంచెం గర్వంగానే అడిగిందామె.

దానికి తడుపుకోకుండా "నాఅదృష్టం మంచిది గదా వాళ్ళెలా మాన్తారే?" అని యెదురడిగింది రంగనాయిక.

"పసుపుల నలుగులూ, బంతాడింపూ, వూరేగింపూ—"

"సడే, అన్నీ అయినా యనిపించుకున్నారు; కాని వొక్కనాడయినా సనిగా సాగనిస్తేనా నేను!"

జానకి చకిత అయి వూరుకుంది.

"నువ్వు గృహప్రవేశానికి వచ్చి వూరేగుతూ మావీధిలో ఆగినప్పుడు "మీవాళ్ళు నన్ను తిరస్కరిస్తే నాకేం లోటా? చూసుకో నాకెలాంటి పిల్ల దొరికిందో?" అన్నట్టు ముందు నీకేసీ తరవాత నాకేసీ చూశారు మీవారు. నా హృదయం గుబగుబలాడిపోయింది. అమాంతంగా పాలకీలోకి దూకి నీపక్కని కూచోవా లన్నంత ఆదుర్దాపడిపోయాను నే నప్పుడు" అంది మళ్ళీ రంగనాయిక.

జానకి ముసిముసినవ్వులు నవ్వుకుంది.

"నువ్వు తొలీమాటు కాపరానికి వచ్చి నప్పు డెన్నివిధాలో ప్రయత్నించాను; కాని నువ్వు కనపడ్డావే కావు"

"అప్పుడు నే నిక్కడ వున్న దేదే? పట్టుమని వారం దినాలయినా—"

"అవునవు" నంటూ అప్రయత్నంగా పావంచాలకేసి చూసింది రంగనాయిక.

దూరాన, యెవరితోనో మాట్లాడుతూ చేతవున్న చెంబుకి చింతపండు పట్టిస్తూ ఒక బ్రాహ్మణుడు వస్తున్నాడు.

మొదట అనుమానించి, కళ్ళు చికిలించు కుంటూ చూసి, చివరకి దృఢపరుచుకుని "అడిగో మా పెద్దన్నయ్య" అంటూ కంగారుపడి "దయవుంచవే చెల్లాయీ" అంటూ పావంచాలమీది బిందె అందుకుని "మళ్ళీ రేపు—కాస్త ఆలస్యమయినా వుండాలిసుమా" అంటూ నీళ్ళుముంచుకుని "సెలవు—సెలవు—సెలవ్" అంటూ ఆత్రంగా బయలుదేరి మాటవినిపించుకోకుండా లేడిలా ఎగిరిపోయింది రంగనాయిక.

అది చూసి జానకి తెల్లపోయింది.

"వాళ్ళ పెద్దన్నయ్య వస్తే యేం? నాతో మాట్లాడితే తప్పా?" అని వితర్కించుకుంటూ, రంగనాయిక అన్నగారిని చూసి బెదురుతూ, తరవాత ఆమెకూడా కొంచెం చురుగ్గానే వెళ్ళిపోయింది.

6

మండువా వాకట్లో పడకుర్చీలోవాలి పార్వతీశం యేదో ఆలోచించు కుంటూ వుండగా, చెరువునుంచి తడిబట్టలతో వచ్చిన జానకి, బిందె బుజమ్మీదే వుంచుకుని చిరునవ్వు నవ్వుతూ యెదుట నుంచుంది.

పదిహేడేళ్ళపిల్ల అయినా సలాక లాగ బక్కపలాచని మనిషి కనక, కుంచెడుతప్పేలా బరువుకే ఆమె వూగిసలాడిపోతోంది.

అది చూసి మందహాసం చేస్తూ "చాలా బరువులు కలిశాయి పాపం, బిందె యింటో దింపేసి పొడిబట్ట కట్టుకురారాదూ అంతపని వుందేనూ?" అనడిగా డతను; కాని దానికి జవాబు చెప్పక, అలాగే నుంచుని, అలాగే చిరునవ్వు నవ్వుతూ "మీకెన్నిసంబంధాలు వచ్చాయండి మొదటా?" అని యెదురడిగిం దామె.

"అదేమిటి?" అన్నా డతను వింతపడి.

"చెబుదురూ"

"ఏమిటి చెప్పడం?"

"బాగానేవుంది, వినపడలేదూ?"

"వినపడితే సరా, బోధపడవద్దూ?"

"పులకం?"

"అబద్ధం ఆడుతున్నా ననే?"

"అయితే మళ్ళీ అడుగుతాను. మీ కెంతమంది పిల్లలనిస్తామంటూ వచ్చా రండీ మొదటా?"

"రావడం చాలామందే వచ్చారు. అయితే, వచ్చిన వారందరూ వొక్కక్క పిల్లనే యిస్తామన్నారు గానీ—"

"కానిమాట అడగలేదు నేను"

"అయిన మాటే చెబుతున్నాను నేను. అయితే—"

"అయితే గియితేల కేంఅవసరం వచ్చిందీ యిప్పుడూ?"

"అదే నేనూ అడుగుతున్నాను. ఇలా అడగడానికేం అవసరం వచ్చిందీ?"

"అవసరమే వచ్చింది?"

"ఏమిటో అది?"

"అదంతా మీకక్కర్లేదండీ"

"ఘోరకలి! నా సంగతి కూడా నువ్వే నిర్ణయం చేసెయ్యదమేనా?"

జావ్యం సహించలేక చురచుర చూస్తూ "చెప్పరూ?" అని కచ్చితంగా అడిగిందామె.

మయూరత్రికేంకారంలా వుందామాట.

ఆశిరస్సు వూపుకి, వొళ్ళంతా వూగి, బిందె కదిలి, నీళ్ళు తటతట్టాడాయి.

అయితే, అసలేమిటో చెప్పకపోవడంవల్ల పట్టుదల వచ్చి "నువ్వు చెప్పావా యేమిటి?" అంటూ మాట మెల్లిగా జారవిడిచాడతను.

కానయితే, అతను చిరునవ్వు నవ్వుతూనే వున్నాడు.

కొంటెచూపులే చూస్తున్నాడు.

కనక, యిదంతా సరాగం అని ఆమెకీ తెలుసు; కాని రంగనాయిక సంగతి తెలుసుకోవాలన్న ఆత్రంలో ఇదంతా తికమకగా కనపడిందామెకి.

ఓపట్టాన యిది తేలదని నిరుకు పరచుకుంది.

వెంటనే "దాచుకోండి" అంటూ చివాలున బయలుదేరేసింది.

ఇది చూసి అప్రతిభుడయిపోయాడతను; కాని వెంటనే మాంద్యం పోగొట్టుకుని "వెళ్ళిపోతావేం? చెబుతారా పాపం" అంటూ లేచినుంచున్నాడు. అయితే అప్పటికప్పుడే ఆమె: "అ-క్క-ర్లే-దు" అంటూ మండువా తిరగవేసుకుని గుమ్మందాటి పడమటింటిలోకి వెళ్ళిపోయింది.

7

నిజం చెప్పవలసివస్తే జానకి మాటకారే; కాని అనవసరమైనమాట వొక్కటీ రానివ్వదు.

అడగవలసిందేమయినా వుంటే సూటిగానూ, స్పష్టంగానూ, మృదువుగానూ, మితంగానూ అడుగుతుంది; గాని అదేపనిగా పట్టుకుని పీడించదు.

అడిగింది చెప్పకపోయినా, కోరింది చెయ్యకపోయినా ధుమధుమలాడదు; కాని వెంటనే జవాబు కావాలి. డొంక తిరుగుళ్ళు పనికిరావు.

ఈసంగతి అతనికి బాగాతెలుసు; కాని వాదం అంటే అతను చెవికోసుకుంటాడు.

అంచేత ధోరణి తరచు ఇలా వచ్చేస్తూ వుంటుంది.

దీనికి ఫలితంగా ఆమె మొగాన అంకితం అయిన అసంతృప్తి చూసి అతను చాలా గాభరాపడ్డాడు.

ఏది?

అక్కడే కూచుంటే ఏదేం లాభమూ?

వెంటనే బయలుదేరాడు.

చూడగా, తలుపు గడియవేసి వుంది.

పిలవగా "పొత్తిచీర కట్టుకుంటున్నానండీ" అని జవాబు.

చేసేది లేక, మరచిపోకుండా వుండడానికి మధ్య మధ్య గొళ్ళెం కదుపుతూ అతనక్కడే — అలాగే నుంచున్నాడు.

అత నొక్కొక్కమాటు గొళ్ళెంకదిపినప్పుడల్లా ఆమె కొక్కొక్క నవ్వుతెర వస్తూ వచ్చింది.

"ఏం, అడగ్గానే చెబితే యేం?" అని వొకమాటూ "నన్ను విసిగించినట్టు లేదేం?" అని వొకమాటూ "ఇంకెప్పుడూ యిలా చెయ్యరుకదా?" అని వొకమాటూ మాట కూడా నాలుక చివరికి వస్తూ వచ్చింది.

కాని, కిమన్నా స్తి.

నవ్వూ అణుచుకుందామె, మాటా బిగపట్టుకుంది.

అయితే, అతను మళ్ళీ కత్తు కలపడానికి వచ్చాడని ఆమెకి తెలుసు.

అయినా, బతిమాలినకొద్దీ బిఱ్ఱబిగిసే రకం కాదు కనక, పని కాగానే తలుపుతీసి, రెప్పవెయ్యకుండా చూస్తూ వెనక్కి తప్పుకుంది.

జరిగిపోయింది గుర్తుంది కనక "నువ్వడిగింది చెప్పడానికి వచ్చా"నని సూటిగా అన్నాడతను.

"నే నే మడిగానూ?"

"చెరువునుంచి యిప్పుడే అలా దొడ్డిదారిని వచ్చావు కామోసు పా-పం"

"పడకకుర్చీలో పడుకుని నిద్రపోతూ వుండగా నేనేదో అడిగినట్టు కల వచ్చింది కామోసు పు-న్నెం?"

ఇది విని పార్వతీశం తెల్లపోయాడు.

ఆమె తల పంకించుకుంది.

కొంతసేపు ఆలోచించి, అప్పటికీ యుక్తితోచక చివరికి "వినవూ?" అని ముండిగా అడిగాడతను.

"ఓమూల పొయ్యి అలా మండిపోతూవుంటే యీమూల మీతో కబుర్లు చెబుతూ కూచోడానికి వీలుటండీ?"

"మండే పొయ్యిమీద తవ్వేడు గిన్ని పడేస్తే ఆరెండూ కలిసి నీళ్ళతో తన్నుకుంటూవుంటాయి కదుటండీ?"

"ఇంకేమీ పని లేదూ?"

"ఇది పని కాదూ?"

"దాటిపోలేదూ?"

"వెనక్కి లాగేద్దాం, మనకి చేతకాదూ?"

తల అడ్డంగా వూపి, పెదిమలు కూడా వొకమాటు బిగించుకుని "వెనకటిది ముందూ, ముందటిది వెనకానూ" అందామె.

"అదో అందం"

"అడగక్కర్లేదు"

"పొరపాటన్నది అందరికీ వస్తుంది; కాని యింతకత్తుల మీద పరీక్ష—"

"ఎవరు చేశారండీ?"

"నేనే కనక, క్షమించండి"

"బాగానే వుంది"

"అయితే, యిక తగువెందుకూ? తడిబట్ట ఆరేసివస్తావా- యీమాట కూడా తప్పులోనే చేరుస్తావా?"

దీని కామె బదులు చెప్పలేదు.

మొదట వొక్క నిశితకటాక్షం మాత్రం విసిరింది.

తరవాత యెదటి గోడదగ్గిర పీటవాల్చి "కూచోండి" అని చెబుతూనే పెరట్లోకి చక్కాపోయింది.

8

"కథ యెక్కడా ప్రారంభించడం?" అని అత నింకా ఆలోచనలోనే వుండగా ఆమె మళ్ళీ వచ్చి, పొయ్యికి దగ్గరగా చిన్న పీట వేసుక్కూచుని "మరి చెప్పండి" అంటూ సావధాన అయింది.

"మొదట వరాసగా అయిదుగురు పెద్దమనుష్యులు, పిల్లనిస్తామని—"

"అయిదుగురూ వొక్కపిల్లనే?"

"ప్రథమకబళే మక్షికాపాతః" మరుపన్నది యెరగవు పాపం, బదులు తీర్చుకునేదాకా నిద్రపోవు"

"ఉలు కలా వుంటుంది కొందరకి"

"కొందరికే కాదు సమయం వస్తే అందరికీ అంతేనండి. మరి కథ వినండి"

"అవెందుకు తిరిగిపోయాయో ముందు చెప్పండి"

ఒకటి మానాన్నగారికి నచ్చలేదు. ఒకటి మాఅమ్మ వొప్పుకోలేదు. ఒకటి లాంఛనాల కుదరక తప్పిపోయింది. ఒకటి నాకు సుతరామూ నచ్చ లేదు. ఒకటి అన్నీ సిద్ధం అయిన్నీ, హఠాత్తుగా మానాన్నగారు పోవడంవల్ల దాటి పోయింది"

"మీనాన్న పోతే ముహూర్తం మారాలి గాని సంబంధమే దాటిపోవడం యేమిటీ?"

"పిల్ల కట్టుతప్పివుండడం వల్ల వారు వెంటనే పెళ్ళయి పోవాలన్నారు. మావాళ్ళు సంవత్సరమధ్యం పనికిరాదన్నారు. కానయితే ఆలోపున వారూ పెళ్ళి చెయ్యలేక పోయారు; కాని అంతలో నాపరీక్షపోయింది. ఇదే సందని పరీక్షలో నెగ్గిన మరొకణ్ణి చూసుకుని వారు నన్ను తిరస్కరించేశారు.

"పాపం పెళ్ళి ఆగిపోదమూ, పరీక్ష తప్పిపోదమూ—"

"నిజమే, మానాన్న పోవడంవల్ల సంబంధం దాటిపోయింది. సంబంధం దాటిపోవడంవల్ల పరీక్ష యెగిరి చక్కాపోయింది"

"అంత బెంగెందుకూ? పెళ్ళికోసమా, ఆపిల్లకోసమా?"

అతను మిడుతూ మిడుతూ చూసి వూరుకున్నాడు.

"ఏం, మాట్లాడరేం?"

"నిజమే చెప్పాలా?"

"తప్పకుండానూ"

"అయితే, ఆపిల్లకోసమే"

ఇలా చెప్పి, ఆమె యేమంటుందో - యేమనుకుంటుందో అన్నట్టు అతను బెదురుచూపులు చూశాడు.

"అది వెనకటిమాట తప్పులేదులెండి" అని అభయం అనుగ్రహించిందామె, అతని యింగితం గుర్తించి.

"నువ్వామాత్రం అనుగ్రహం చూపిస్తే యిక చెప్పకేం? ఆ సంబంధం కుదిరినందుకు మొదట నేను వెయ్యిమంది దేవుళ్ళకు మొక్కుకున్నాను. తప్పిపోయి నందుకు, తరవాత చాలాకాలం మతిపోయి—"

"చివరి కెలా తిరిగిపోయిందండీ చూపు?"

"కోరుకున్న వన్నీ సమకూడడానికి మనమేం దేవతలమా? అపుతుందంటే ఆశపడ్డాను, తికమకలు వస్తే బెంగ పెట్టుకున్నాను, కాకపోగా, ఆశ వదులుకున్నాను. ఆశ యెలాపోయిందో—"

"మొగాళ్ళు అంత సులభంగా తిప్పేసుకోగలరు కామోసు మనస్సు"

"తిప్పేసుకోగల రంటే—"

"తరువాతి సంగతి చెప్పండి. మీరు తప్పిపోయినందుకాపిల్ల యేం చేసిందో?"

"నాకంటేనూ ఘోరం చేసింది"

"అక్కడికి మీరు మహా ఘోరం చేసినట్టు"

"నువ్వే కాదూ యిప్పుడే అన్నావూ?"

"నేనా?..............ఏమనమ్మా?"

"మొగాళ్ళు అంతసులభంగా తిప్పేసుకోగలరు కామోసు మనస్సు అనమ్మా"

"వోస్ అదా?............పోనీ, వొప్పుకున్నాను. అయితే, ఆపిల్ల చేసిన ఘోరం యేమిటీ?"

"ముహూర్తం దాటిపోయినందుకు బెంగ పెట్టుకుందిట. మరో సంబంధం కుదిర్చినందుకు నిట్రుపవాసాలు చేసిందిట. పెళ్ళిలో వొక్కమాటూ సంబర పడుతూ పీటలమీద కూచోలేదుట"

"ట"

"టా కాకపోతే నేను చూశానా? ఆ పెళ్ళికి నేను వెళ్ళాననుకున్నావా?"

"మీరు వెళ్ళివుంటే ఆఅమ్మాయి తలంబ్రాలు మీమీదే పోసును, కదూ?"

"ఇంకా సందేహమా? చూసినవాళ్ళలాగే అన్నారు"

జానకి మాట్టాడలేక పోయింది.

"ఊరివాళ్ళందరూ చాలా విడ్డూరంగా చెప్పుకున్నారు, కొన్నాళ్ళదాకా"

"ఏమనీ?"

"ఆపిల్ల ఆపిల్లాడితో కాపరం—"

"అక్కర్లే దక్కర్లేదు, పెళ్ళయిన తరవాత యేంజరిగిందో అది చెప్పండి"

"తరవాత కూడా ఆపిల్లచూపు నామీదే వుంది."

జానకి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఎలా తెలిసిం దనా?"

"అవును"

"నువ్వు మునుగుడుపులకు వచ్చినప్పుడు, తెల్లవారుజామున ప్రయాణం అనగా, రాత్రి, నీమెడలో మల్లెమొగ్గల దండ వేశాను, జ్ఞాపకం వుందా?"

"లేకేం? అప్పుడు మీచిటికెనవేలు నాబుగ్గకి తగిలి వొళ్ళంతా గరి పొడిచింది"

"ఇంకేం? ఆదండ ఆపిల్ల పంపిందే"

తన చెవులనే నమ్మలేకపోయింది జానకి.

"ఆవేళ ఆపిల్లాడు ఇక్కడే వున్నాట్ట కూడా"

"అయ్యో"

"దండ పంపడమే కాదు, నీకు వెయ్యమని కబురుకూడా పంపింది"

"అదేం చిత్రమండీ?"

"చిత్రం కాకేం?"

"అయితే, యీసంగతి మీకెలా తెలిసిందీ?"

"మాసుబ్బత్తగారి రత్తమ్మ తెచ్చింది దండా కభూరూను"

"అలాగా?"

"మరోమాటు—అంటే నువ్వు మా చెల్లాయికూతురి అన్నప్రాశనకు వచ్చినప్పుడు అరవిచ్చిన గులాబీ పువ్వులు బుట్టెడు పంపింది"

"ఏవీ, నా కిచ్చారు కారేం?"

"చేతితో తాకకుండానే వెనక్కి పంపేశాను"

"ఏం?"

చురచుర చూస్తూ ఆమె ఖంగుమని వేసిందీ ప్రశ్న.

"పువ్వులంటే నీకు సంబరం అని అప్పటికే నాకు తెలుసు; కాని ఆపిల్ల అలాచేసినట్టు తెలిస్తే వాళ్ళవాళ్ళు కోప్పడరూ? సంబంధంతో పాటు మాటలు కూడా తప్పిపోయాయి మాకు"

"అయితే?"

"అంచేత తిప్పేశాను"

"తిప్పెయ్యడానికి మీకేం అధికారం వుందండీ?" అని నిలవతీసిం దామె.

"అంటే?" అన్నా డతను తెల్లపోయి.

"ఆవిడ నాకోసం పంపిం దాపువ్వులు"

"ఓ—హో, అవునుసుమా. నాది తప్పే"

"ఇక ఆమాట మరిచిపోండి. తరవాత మీరెప్పుడయినా ఆపిల్లతో మాట్టాడారా?"

"లేదు"

"ఆపిల్లో?"

"చాలామాట్లు ప్రయత్నించింది; కాని నేను తప్పించుకుంటూ వచ్చాను; ఒకమాటు సాహసించి వేళాకోళంచేసింది. నేను బదులుచెప్పలేదు"

"ఎంత చిన్నపుచ్చుకుందో పాపం"

"అందుకు నేనేం చెయ్యగలనూ? ఆపిల్లకి నాకూ సంబంధం యేమిటీ?"

"ఎంత తీసేసుకున్నా ఆవిడ మీ పెళ్ళామే"

"నిజాని కంతే. దానికి జరిగింది రెండో పెళ్ళే"

"ఇంకేమండీ?"

"మరి లోకం మాట? పోనీ అంటే అప్పటి కింకా ఆ పిల్లాడు బతికే వున్నాడు"

"అప్పటి కంటే?"

"గులాబీలు పంపాటప్పటికి తరవాత మూడు మాసాల కతను చచ్చి పోయాడు. మరో మూడుమాసాలకాపిల్ల రజస్వల అయింది"

"రామరామా"

"ఊరంతా యేడ్చారు; కాని ఆపిల్ల కంట తడయినా పెట్టలేదుట. "శని విరగడయిపోయిం"దని కూడా అందిట"

"అనదూ? అయితే, అప్పుడేనా వాళ్ళ వాళ్ళకి బుద్ధి వచ్చిందా? ఆతల్లి కెవరయినా గడ్డిపెట్టారా?"

బదులు చెప్పలేక అతను మొగం పక్కకి తిప్పుకున్నాడు.

"పోనీ, ఆపిల్లపే రెవరండీ?"

"రంగనాయిక"

"మీకు బాగుందా ఆ పేరు?"

"నిక్షేపంలా వుంది"

"నా పేరుకంటే బాగుంది కదూ?"

"నీపేరు మాత్రం?"

"మావూళ్ళో—"

"మీ దేవూరూ?"

"అవునవును, తప్పే, మావాళ్ళ వూళ్ళో మాయింటి పక్కని - కాదు కాదు, మావాళ్ళ యింటిపక్కని వొక శూద్రపిల్ల వుంది"

"ఉంటే?"

"దాని పేరు రంగమ్మ"

"అయితే?"

"రంగనాయికమ్మ అని మార్చుకోమని లక్షమాట్లయినా చెప్పాను దానికి"

"పేరు మంచిదే! రూపమూ సాటి లేనిదే. వైధవ్యం వచ్చినా ఆచక్కదనం తరిగిపోలేదు"

"ఏమి లాభమూ? బూడిదలో పోసిన పన్నీరు. సరే కాని తరవాత మీకెప్పుడయినా కనపడిందా?"

"లక్షమాట్లు కనపడింది"

"మీరు కనపడ్డప్పుడు దాని మొగం—'

"నేను చూశానా?"

"వే-శారు దాటు"

"ఏం?"

"పోనీ, ఆవిడ కనపడ్డప్పుడు మీకెలా వుండేదో చెప్పండి నిజంగాను"

"ఎప్పుడయినా, అయ్యో పాపం—"

"ఎప్పుడయినానా? అయ్యో అని యింతే?"

"వొట్టు"

"వొట్టువద్దండి, పాపం ఆవిడ ఎంత దుఃఖిస్తున్నారో?"

"మొగుడు పోతే దుఃఖం కాదూ?"

"తప్పుతప్పు, వోగాయిత్యం మాట లనకండి"

ఇది విని చకితుడయి "ఇవాళ నీధోరణి యిలా వుందేం జానీ?" అనడిగాడతను.

"ఆడవాళ్ళ బతు కింతటిదే కాదూ?"

"చెప్పవూ?"

జానకి మాట్లాడలేదు.

"చెప్పవూ!" అని మళ్ళీ అడిగాడతను.

సరిగా యీ సమయాన, వీధితలుపు గుంజుతూ పిలుపుమీద పిలుపు పదిమాట్లు పిలిచావారెవరో.

"వస్తున్నా, వస్తున్నా, ఆ, అదే గుంజడమా? వినిపించుకోవద్దూ?" అని గదుముతూ పార్వతీశం వాకట్లోకి చక్కాపోయాడు.

వచ్చిన మనిషి భర్తవైపు చుట్టం అని తెలియగా, పాద్యం యిచ్చి, కుశలప్రశ్నాదికం కూడా కానిచ్చేసి, తవ్వెడు గిన్నె దింపేసి మూడుసోలల గిన్నెతో యెసరు పడేసింది జానకి.

9

తరవాత, భోజనాల వేళదాకా ఆదంపతులకు మాట లందలేదు. అప్పుడయినా చుట్టం వుండడంవల్ల యీ ధోరణీ రాలేదు.

రాత్రి కూడా పన్నెండయాదాకా చుట్టం పార్వతీశాన్ని నిద్రపోనివ్వలేదు.

తెల్లవారింది.

కాలకృత్యాలూ, ఇంటిపనులూ, వీటితో జానకీ పార్వతీశమూ సంసారసాగరంలో పడిపోయారు

ఆసాగరంలో ఆచుట్టం వొక పెద్దకెరటం అయి వారినిద్దర్నీ దూరం దూరంగా నెట్టేస్తూ వచ్చాడు.

జానకి ఆవేళ మామూలువేళకే చెరువుకి వెళ్ళింది; కాని అరగంట కనిపెట్టుక్కూచున్నా రంగనాయిక రాలేదు.

మర్నాడు కూడా ఆమె రాలేదు.

దీనికి సాయం. ఇంటో, కానవరపుజీడి లాగా చుట్టం.

ఈ రెండుదినాలూ, జానకమ్మ, యేదో పోగొట్టుకున్నట్టూ, ఏదో మరచి పోయినట్టూ మందుతిన్నట్టూ అయిపోయింది.

ఈస్థితి చూసి పార్వతీశం "యేం చెప్మా?" అనుకోకపోలేదు; కాని యేమని అడగలేకపోయాడు.

ఆదంపతుల అనురాగమూ, ప్రకృతమూ జానకి అనుభవిస్తున్న ఆందోళనా, దాంతో పార్వతీశం పొందుతున్న క్షోభా యెంత మాత్రమూ గుర్తుంచుకోలేని చుట్టం, విసిగించి, వేపేసి "యింక వెళ్ళడా యేమిటి బాబూ?" అనిపించుకుని మూడోనాడు చల్లబడ్డాక వెళ్ళిపోయాడు.

మొగమాటపెట్టి పార్వతీశాన్ని మాచవరం రేవుదాకా కూడా తీసుకు వెళ్ళాడు.

"ఉంటానండి" అని చుట్టందగ్గిర సెలవు పుచ్చుకుని వీధి గుమ్మంలోనే ఆగిపోయి, యాదాలాభంగా వొక్క నిమిషం అక్కడే వుండిపోయింది జానకి.

అందుకు తగ్గట్టుదూరాన రంగనాయిక కనపడింది.

ఎక్కణ్ణుంచో తమ యింటికేసే వస్తున్న రంగనాయికను చూశాటప్పటికి జానకి ప్రాణాలు లేచివచ్చాయి.

ఇంతలో రంగనాయిక అక్కడికివచ్చి, జానకి గుమ్మంలోనే వున్నందుకు మొగం యింతచేసుకునీ కూడా యెవరయినా వస్తున్నారేమో — అథవా చూస్తున్నారేమో అని వెనక్కీ ముందుకీ బెదిరిబెదిరి చూస్తూ "రేపుస్నానం" అని అలుగో జాస్వరంతోచెప్పి క్షణం అయినా నుంచోకుండా వెళ్ళిపోయింది.

అయినా, జానకి ఆమె కనపడ్డందుకే ఆనందించింది.

చెరువుకి ఎందుకు రావడం లేదో ఆకారణం తెలవడంవల్ల ఆమెకి ఆందోళనకూడా తగ్గిపోయింది; కాని ఆమాట చెప్పడాని కంత సంకోచించడమూ, జడుస్తూ వెనక్కీ ముందుకీ చూడడమూ ఆమె కేమీ బోధపడలేదు.

ఆమె పుట్టింటివారికీ తన భర్తకీ ముఖావలోకనాలయినా లేవు కనక తనతో బాహాటంగా మాట్టాడలేక పోతోం దనుకుందామంటే, అయితే, అసలలాగయినా మాట్టాడ్డమూ "చెల్లీ" అనడమూ "వొసే అక్కయ్యా" అనిపించుకోవడమూ యేమిటీ?

పాత ఆందోళన పోయి కొత్త జిజ్ఞాస పట్టుకుంది. అయినా, రంగనాయిక మ్మాత్రం విడవరానిదిగా కనపడింది.

దానిమీద "అక్కయ్య అన్నట్టు వెనకటిజన్మలో యిద్దరం వొక్క కడుపున పుట్టామేమో" అనుకుందామె.

"ఒకవూళ్ళోనే వుండినా, అత్తిళ్ళవారికి గర్భశత్రుత్వం వున్నచోట ఇద్దరక్కాచెల్లెళ్ళు యిలాగే అవస్థ పడుతూ వుంటారుకామోసు" నని ఆశ్చర్య పడిం దామె.

దీంతో, ఇక్కడ జానకమ్మకి, దినమ్మూ అక్కడ రంగనాయికమ్మకి లాగే ఆరాత్రి చాలాభారం అయిపోయింది.

కళ్ళు పొడుచుకున్నా నిద్రరాదు.

ఏమీ పాలుపోదు.

పోనీ అంటే, యెంత సేపటికీ తెల్లవారదు.

ఈ స్థితిలో మూడోజామున జానకమ్మకి ఒక క్షణం కలత నిద్రపట్టి, అందులో వొక కలవచ్చింది.

ఉన్నస్థలం యేదో గుర్తుకి రాలేదు; గాని రంగనాయిక మధుపర్కాలు కట్టుకుని వుంది.

ఎవరెవరో, పేరంటాళ్ళు తగువులు పట్టుకు వస్తున్నారు.

తాను, అవన్నీ అందుకుంటూ, వారికందరికీ పసుపూ పారాణీ రాసి, గంధం పూసి, తాంబూలా లిచ్చి "మంచిదండీ" "మంచిదండీ" అని సెలవిచ్చి పంపేస్తోంది.

ఇంకొక్క నిమిషం అలాగే వుంటే కల పూర్తి అయి పర్యవసానం తెలిపోయి వుండును; గాని వొత్తిగిల్లడంలో పార్వతీశం చెయ్యి మీదపడి మెళుకువ వచ్చేసింది.

కళ్ళు నులుముకుంటూ లేచి చూడగా పార్వతీశం గాఢ నిద్రలో వున్నాడు.

అతని సుస్నిగ్ధగండఫలకం మీద సన్నని దీపకాంతి జిగ జిగలాడు తోంది.

అది చూసి, చలించి, ఉద్రిక్త అయి, వివశఅయి, ఊర్ధ్వశ్వాసతో మీద వాలి అతన్ని గట్టిగా పొదువుకుని, చుంబనముద్ర వహించిన పెదవులతో ఆచెక్కిలి గట్టిగా నొక్కి, తానే నిలువునా కరిగిపోయిం దామె.

10

ఆ సందులోనుంచి వొకరూ, యీ సందులోనుంచి వొకరూ జానకీ రంగనాయికా వొక్కమాటే చెరువుకి వచ్చారు.

"నీకు వెయ్యే" ళ్ళంటే "నీకు లక్షసంవత్సరా" లంటూ అతివేగంగా యిద్దరూ దగ్గిరికి చేరుకున్నారు; కాని పొంగిపోతూ పావంచాల దగ్గిరికి వెళ్ళా టప్పటికి, అరమూతలు పడ్డ కళ్ళతో చెరువులో నుంచుని వొక ముసలి వితంతువు తులసి పూసల పేరు గిరగిరా తిప్పేస్తోంది.

అది చూసి తెల్లపోయి మొదట యిద్దరూ నాలుకలు కరుచుకున్నారు.

తరవాత, బోసిపులిని చూసిన లేడిపిల్లల్లాగ చెరోవైపూ తప్పుకుని, యెక్కడా యెలాంటి సంబంధమూ లేనివాళ్ళలాగ పావంచాలకి ఆచివర వొకరూ యీ చివర వొకరూ కూలబడి, కీగంటిచూపులతో కబుర్లు చెప్పుకుంటూ, నొక్కి తోముతున్నట్టు నటిస్తూ తెల్లగానే వుండిన బిందెలు వొట్టిచేతులతో బులబులాగ్గా పామడం మొదలు పెట్టారు.

అయితే, వొక్కక్షణం అయేటప్పటికి, ఆనటనలో, బిందెలు పావంచాలకి రాసుకుని చప్పుడయింది

అది ముసలావిడ చెవిని పడింది.

పూసలపేరు తిరిగిపోతూనే వుంది "యెవరది? రంగా?" అం దావిడ.

"ఆ"

"తంగిరాలవారి రంగమ్మవేనా నువ్వు?"

"అవు నత్తా!"

"కాశీనుంచి వుత్తరం వచ్చిందా?"

"నాకు తెలవదు"

"కాలూ చెయ్యీ వొంగీదాకా కూతుర్ని కదపలేక పోయింది మీచిన్న మేనత్త. అయితే, మీపెద్ద మేనత్త కాశీ చేరుకున్నట్టేనా?"

"నా కదేమీ తెలవదమ్మా"

"ఏదీ తెలుసుకోక యేంచేస్తున్నావే నువ్వు?"

రంగనాయిక మొగం పక్కకి తిప్పుకుని పళ్ళు పట పట్టాడించింది.

అడిగింది సరిగా చెప్పనందుకూ, చివరికి బదులుకూడా చెప్పనందుకూ ముసలావిడ వొక్కక్షణం రుసరుసలాడింది; కాని చివరికి "పోనీ. ఆపిల్ల యెవరూ!" అనడిగింది.

"ఎవరో కొత్తపిల్ల, పీసపాటివారి కోడలేమో"

"పార్వతీశం పెళ్ళామా?"

"కామోసునమ్మా, తెలవ దనలేదూ?"

"కథుపా?"

"ఛీ" అన్నట్టు పళ్ళు బిగించుకుని పక్కవాటుగా నిప్పులు కక్కింది జానకి.

"సడే" అంది రంగనాయిక విసుగ్గా; కాని కాస్తో కూస్తో యింగ్లీషు కూడ వెలిగించిందిట మరి అన్నం వండగలదుషే ఆపిల్లా? చెరువునుంచి నీళ్ళు కూడా మోస్తోందీ?" అని మళ్ళీ అడిగింది ముసలావిడ.

అందుకు "బాగా గడ్డిపెట్టు" అన్నట్టు చురచురచూస్తూ జానకి తల ఆడించగా "ఇంగ్లీషు రుచిచూసిన ఆడపిల్లలు, ముసలమ్మలు వండిపెడితేగాని అన్నంకూడా ముట్టరుటమ్మా" అంది రంగనాయిక, యెత్తిపొడుపుగా.

ముసలావిడికి యీమాట శూలం లా గుచ్చుకుంది. దాంతో అగ్గయిపోయి, పూసలపేరు తిప్పడం కూడా మరచిపోయి "హేళన చేస్తావుషే పిల్లా? పెద్దా పిన్నా తారతమ్యం చూడవద్దూ? మీనాన్నతో చెబుతాసుమా" అంది బోసి నోరు తాటించుకుంటూ.

"ఈదారినే వెడతావా అత్తా మాయింటికి?"

"ఆ, ఆ, యేమన్నావూ? నన్ను చచ్చు పెద్దమ్మకింద కట్టేశావు?"షే

ఇది విని రంగనాయికని కళ్ళతో మెచ్చుకుంది జానకి.

"నేనంటే మీనాన్నకూడా గడగడలాడతాడుగదా—"

"నీకు కోపంవస్తే వచ్చింది కానీ — దానికి నాపూచీ యేమీ లేదు గానీ— ఋచ్చెమ్మత్తా, పెద్దదానవుకదా, జపంకూడా వెలగబెడుతున్నావు గదా, అడిగే వాళ్ళు లేక కాని నీకిప్ప డీపరీక్షలన్నీ ఎందుకూ?" అంటూ నిలవతీసింది, రంగనాయిక.

"శాబాసు, అడిగితే తప్పుషే?"

"బాగుంది, తెలవంది చెప్పకపోతే తప్పటమ్మా?"

"ఎదుటే వుందికదా, కాస్త అడిగితెలుసుకుంటే యేమే?"

"ఆపిల్లని నువ్వే అడిగితే యేమమ్మా?"

"ఏం విరగబాటు తనమే మాతల్లీ? మూలపడ్డా పులుసు విరగలేదు కామోసు"

"మూలపడ్డం ఏమిటమ్మోయ్, ముందుకివస్తూంటే?"

"ఆ, ఆ, ముందుకి వస్తున్నావూ? అందేతే కాలం యిలా మండిపోతుంది"

"అవును, వేసవి ముదిరింది కదా మండిపోక మరేం చేస్తుందత్తా?"

"నీవంటివాళ్ళు బయలుదేరాక యేకాలమూ మండి పోతోంది........హరే రామ హరే రామ........ అన్నీ కిరస్తానీ వేషాలూ సానిటక్కులూనూ........ ర్రామ ర్రామ హరే హరే........ మావంటివాళ్ళం యిక బతగ్గూడదు........ హరే

కృష్ణ హరేకృష్ణ.......బ్రాహ్మణ్యం యెలాగా యిక బుగ్గయిపోతుంది........ రాఘవా! రామచంద్రమూర్తీ! జానకీ మనోహరా! రంగనాయకులు తండ్రీ—"

"నీమొగుణ్ణి పిలుస్తోందే చెల్లెమ్మోయ్" అన్నట్టొకరూ 'నిన్నూ కలిపిందే అక్కయ్యోయ్" అన్నట్టొకరూ చూసుకుని వారిద్దరూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

"త్రిపురాసురులను సంహరించిన తండ్రీ! శూర్పణఖ ముక్కూ చెవులూ తెగ్గోయించిన ధర్మరాజా! యీ వేషాలు నీకు కనపడ్డం లేదుషయ్యా బాబూ"

తోకతొక్కిన ఆడతాచులాగ లేచినుంచుని "ఇద్దరూ వొక్కటేకాదూ అత్తా?" అని కరుగ్గా అడిగింది రంగనాయిక.

ఈవెక్కిరింపు ముసలావిడ కళ్ళల్లో కారంకొట్టింది.

దాంతో, ఆవిడి కోపం అంతా కాళ్ళల్లోకి దిగజారింది.

ఆవిడ పదిగజాలు వెళ్ళేదాకా అతికష్టంమీద ఆపుకుని తరవాత, యెలావున్న బిందె అలా విడిచేసి, జానకీ రంగనాయికా విరగబడి నవ్వుకున్నారు.

11

"ఇక వెనక్కిరాదు" అంటూ జానకి బయలుదేరింది.

పై పావంచామీదికి వెళ్ళి చూసి "యెవరూ రావడం లేదు. మనం యిద్దరమే వున్నాం" అంటూ రంగనాయిక కూడా బయలుదేరింది.

చెయ్యీచెయ్యీ పట్టుకుని, చెరువులో గుండెలలోతుకి వెళ్ళి యథాపూర్వంగా మళ్ళీ గట్టిగా కౌగలించుకుని, కంఠాల దాకా మునిగిలేచి కబుర్లకందుకున్నారు వారు.

"వారిదగ్గిర నామాట యేమయినా తెచ్చావా యేమిటి చెల్లీ" అనడిగింది రంగనాయిక మెల్లిగా.

"లేదక్కా! యేమిటో వూరుకున్నానే" అంది జానకి.

"వద్దు వద్దు. బాగుండదు. మంచిపనే చేశావు నువ్వు.... .... కానైతే దీట్లో తప్పేమీలేదు కానీ – అయినా యేమే చెల్లీ?"

"నువ్వేమంటావో—?"

"అదే బాగుంది....పోనీ ఏమే చెల్లీ?"

"ఏమిటే అక్కా?"

"........ఓమాటు కదిపిచూస్తే యెలా వుంటుందో?"

"ఏమన మంటావు?"

"ఏమనమంటానా?..........ఏమనమంటానా? సిగ్గూ ముచ్చటాకూడా—పోనీ మానేస్తే?"

"నీయిష్టం"

"..........ఊరుకో, ఏమంటే? ఎటొచ్చి యెటుపోతుందో? కనక పూరుకోవే చెల్లాయీ"

జానకి పూరుకుంది. రంగనాయికే పూరుకోలేకపోయింది.

"మనస్సు మనస్సులో లేదు. వెనక్కీ ముందుకీ—"

"నువ్వు కనపడక నేనుపడ్డ బాధ—"

"నాపనీ అలాగే వుంది. ఈమూడు దినాలూ నాకు నిద్రాహారాలు లేవు. నిన్న రాత్రి వొక కలకూడా—"

"ఏమనీ?" అని అవ్యధానంగా అడిగింది జానకి, తనకి వచ్చిన కల జ్ఞాపకం చేసుకుంటూ.

"నువ్వూ నేనూ వారూ యెందుకో రాజమండ్రి — యెవరో వస్తున్నారే"

ముంగాళ్ళమీద నుంచుని, నలుగురు కమ్మపడుచులు వస్తూవుండడం చూసి, కొంచె యెండగా జరిగి, వొకరితో వొకరికి సంబంధం లేనట్టు చెరో వైపుకీ తిరిగి ఇద్దరూ వొళ్ళు తోముకోడం మొదలుపెట్టారు.

12

కమ్మపడుచులలో వొకామె జానకినీ, వొకామె రంగనాయికనీ పలకరించారు.

తాపీగా బిందెలు ముంచుకుని, తమలో వొకామె చెల్లెలి పెళ్ళిమాటలు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

అక్కాచెల్లెళ్ళిద్దరూ మళ్ళీ ముంగాళ్ళమీద నుంచునిచూసి, మళ్ళీ దగ్గిరసా చేరుకున్నారు.

"మాయింటి కోమాటు రావుచే అక్కయ్యా?" అంటూ జానకి రంగనాయిక చెయ్యిపట్టుకుంది.

"అమ్మయ్యో" అని రంగనాయిక వొణికిపోయింది.

"ఏమే?"

"వారు చూస్తే?"

"చూస్తే? చూస్తే యేమిటమ్మా? ఏంభయమమ్మా?"

"ఇంకేమయినా తరవాయి వుంటుందా?"

"ఏమంటా రేమిటమ్మా?"

"ఏమో అంటే యింకేం? మాటే ఆడరు. అంతకంటే మరేమిచెయ్యాలి?"

"మాటాడరూ?" అని చురుగ్గా అడిగింది జానకి.

"ఆడరు"

"మాటాడరూ?" అని మళ్ళీ రెట్టించింది జానకి, తన ప్రతాపం తలుచుకుంటూ.

"మాట్టాడ రనుకో. ఆడకపోతే యేమిటో చెప్పు"

"నేను మాటాడిస్తా కాదూ?"

"నువ్వు చెప్పినట్టు వింటారా?"

"వినకపోతే యెరగరూ?"

తల అడ్డంగా వూపుతూ జానకి యిలా సాగతీసుకోగా "నిజంగా?" అనడిగింది రంగనాయిక.

"చూడరాదూ;" అనడిగింది జానకి గర్వం కనపరుస్తూ.

"నువ్వు నన్నా కాశాని కె త్తేస్తున్నావే చెల్లీ"

ఇలా అంటూ రంగనాయిక జానకి బుగ్గలు నొక్కింది.

"వారికి తెలవకుండా నువ్వు దొడ్డిగుమ్మాన లోపలికిరా. ఇద్దరమూ పడమటింటో కూచుందాం. వాకట్లో యెవరితోనో మాట్టాడుతూ మాట్టాడుతూ కాఫీకోసం వారు లోపలికి వస్తారు. పీటవేసి కూచోబెట్టి నేను దగ్గిరేవుంటాను. కప్పూ సాసరూ నువ్వు చేతికందించు"

"బాబోయ్" అంటూ చెయ్యి లాక్కుని రంగనాయిక రెండుచేతులూ నలుపుకుంది.

"అదేమిటే మాతల్లీ?

"అది వింటేనే కాళ్ళు వొణికిపోతున్నాయే మామ్మా"

"సింగినాదం కాదూ?"

జానకి యిలా అనగా, ముసిముసినవ్వులు నవ్వుకుంటూ రంగనాయిక మొగం పక్కకి తిప్పుకుంది.

ఒక్కక్షణం అలాగే వుండి, మళ్ళీ జానకి కేసిచూస్తూ "వా రవి పుచ్చుకోకపోతే నేను నిలువునా చచ్చిపోవాలిగాని మరోదారి వుందా?" అనడిగిందామె.

"చూశావా? నేనుంటా నన్నాను కాదుటే?"

"తీరా—"

"కాఫీ యిచ్చినందుకు నీకు కృతజ్ఞత కూడా విన్న వించుకునేటట్టు చేస్తాను, చూసుకో"

రంగనాయిక మొగాన ఆనందం గుప్పు మంది.

"ఏమంటావే? రావే మామ్మా! పోనీ,దినమ్మా రావద్దులే, వొక్కమాటురా, ఏం?"

"నీధైర్యమూ నీబలవంతమూ చూస్తే రావాలనీవుంది: నిన్నూ వారినీ డబుల్ కుర్చీలో కూచోబెట్టి, మేజామీద ఫలహారాలూ కాఫీ వుంచి, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ మీ రవి అరగిస్తూవుంటే చేతులు కట్టుకుని యెదట నుంచోవాలని యెంతయినా వుంది నాకు"

జానకి మనస్సు పూగిపోయింది. పెదవులు దరహాస విరశితాలయినాయి. కళ్ళు లజ్జాముద్రితా లయినాయి.

హృదయం ఆనందముగ్ధం అయిపోయింది.

దాంతో పరవశ అయి, వొక్కక్షణం మాట్టాడలేక, చివరికి "నిజంగా అక్క అంటే నిన్నే చెప్పాలి" అంటూ ఆమె చేతులు పట్టుకుంది జానకి.

జానకి చేతులు రంగనాయిక పట్టుకుంది.

ఇద్దరూ వివశలయి ప్రీతినెరుపుకున్నారు.

"అందుకోసమయినా రావే. సిగ్గుపడకు. ఏం? వస్తాననవే" అంటూ ఆమె జబ్బలుపట్టుకుని వూపేసింది జానకి.

దానిమీద వొక్క క్షణం ఆలోచించి "అయితే వోపని చేస్తావా?" అనడిగింది రంగనాయిక.

"ఏమిటదీ?" అని జానకి అడగ్గా, వొకమాటు పైకి చూసి, వొకమాటు జానకి కళ్ళల్లోకిన్నీ గంభీరంగా చూసి, మళ్ళీ, అందుకుంది ఆమె.

"ఇవాళ సుబ్బమ్మపిన్ని కూతురుచేత మల్లెమొగ్గలదండలు రెండు పంపిస్తాను"

"పంపిస్తే"

"ఒకటి వారికి___"

"వేసి?"

"నేను పంపానని చెప్పి మరీ___"

"అలాగే వేస్తాను. వేస్తే?"

"దానిమీద యేమి జరుగుతుందో చూడు. నిజంగా జరిగింది జరిగినట్టు నాతో చెప్పాలిసుమా రేపు"

"ఇన్ని తికమక లెందుకే?"

"ఇవి తికమకలు కావు. ఇలా చేస్తే వారికి నామీద దయ వుందో లేదో___"

"ఉందనుకో. ఉందని తెలిపోతుందనుకో, ఉంటే?"

"మావాళ్ళేమో చేస్తారని నాకు భయం లేదు. నాకు వాళ్ళ లెక్క లేదు"

"దయవున్నట్టు తెలిస్తే? తరవాత యేమిటో చెప్పవే"

"మీయింటికి వచ్చేస్తాను"

"నిజంగా?" అనడుగుతూ జానకి చెయ్యిచాపింది.

"నాతల్లే, నాబంగారుకొండే! నిజంగా వచ్చేస్తానమ్మా! వచ్చివారిని సేవించుకుంటాను. నీకాళ్ళు కడిగి దాహం పుచ్చుకుంటాను" అంటూ ఆచేతిలో చెయ్యివేసి, వొక్క మాటు అరిచెయ్యి గట్టిగా గిల్లి, పట్టుకుంది రంగనాయిక.

చూడగా, ఆమె కళ్ళలో ఆనందబాష్పాలు సుడితిరిగిపోతున్నాయి.

అది చూసి, తనకిన్నీ అదే స్థితి సంభవించగా గద్గదకంఠ అయి అతి కష్టాన "మరిచిపోకు సుమా" అంది జానకి.

"నిన్ను చంపుకుతిన్నట్టే, సరా? తప్పకుండా వస్తాను తల్లీ? ముమ్మాటికీ వస్తాను. ఈమూడు దినాలూ నిన్ను చూడకుండానే వుండలేకపోయాను, అది తెలిస్తే విడిచి క్షణం వుండగలనా?"

"తప్పకుండా పంపుతావు కాదూ మల్లెదండలు?"

"వీల్లేకపోతే భోజనం కూడా మానేస్తానుగాని దండలు పంపకుండా వుంటానా?"

ఎన్ని గంటలకి?"

"ఆరు—తప్పితే యేడింటికి"

"మరో అరగంటచూస్తాను. అప్పటికీ దండలు రాకపోతే నాకు మతిపోతుంది సుమా"

"మామ్మే, మాతల్లే! నేనెంత పుణ్యంచేసుకున్నానే? నేనెంత పెట్టి పుట్టానే?" అంటూ రంగనాయిక, జానకి కణతలమీద మెటికలు విరిచింది.

"ఉన్న మొగ్గలన్నీ మాకే పంపేస్తే మరి మీవాళ్ళేమీ అనరూ?" అనడిగింది జానకి.

"ఎందు కంటారూ? రెక్కలు పడిపోయేలాగ మల్లెపాదులుకి నీళ్ళు పొయ్యడం నేనే కాదా యేమిటమ్మా? కాకపోయినా మాయింటోది యివాళ వొక్క మొగ్గఅయినా ముట్టుకోను. సుబ్బమ్మపిన్నిగారింటో దినానికి గంపెడు మొగ్గలవుతాయి. అవన్నీ వాళ్ళకీ వాళ్ళకీ యిచ్చెయ్యడమే కాదూ రత్తమ్మక్కయ్యా?"

"నిన్న మాకూ తెచ్చిపెట్టా రక్కయ్యగారు"

"ఇవాళ అయినా తేవడం అదే. దండలుమాత్రం—"

"తప్పకుండా పంపు"

"తప్పకుండా పంపుతాను. రెండుదండలూ నేనే గుచ్చుతాను. అరిటి మొవ్వతో పొట్లంకూడా నేనేకడతాను"

"సరే"

"గంధం కూడా పంపనా?" అనడిగింది రంగనాయిక, వూపిరిబిగ పట్టుకుని బెల్లించి చూస్తూ.

"నిన్ను మరీ మెచ్చుకుంటా" రంది జానకి.

"మెప్పా?"

"కాకేమమ్మా?"

"చివాట్లు—"

"చాల్లేవే నేర్చుకుపోయాంవ్"

"చూస్తావు కాదూ?"

"వింటావు కాదూ?"

"సంయే"

"సంయే"

ఇద్దరూ మళ్ళీ ముంగాళ్ళ మీద నుంచుని చూశారు.

దూరాన ముగ్గురు వైశ్యస్త్రీలు కనపడ్డారు.

"కబుర్లందుకుంటే మనలాగే విడిచిపెట్టరు, పోదామే"

"పదవే"

"నువ్వు వెడతావా, ముందు, నేను వెళ్ళనా?"

"నన్నే వెళ్ళనియ్యి"

"వెళ్ళు" అని చెప్పి, పావంచాలమీది బిందె పట్టుకువెళ్ళి, నీళ్ళు ముంచి, జానకి బుజాని కెత్తి "మళ్ళీ రేపు. అంతేనా చెల్లీ?" అనడుగుతూ పావంచాలదాకా వచ్చి తన బిందె అందుకుంది రంగనాయిక.

గారాం కుడుస్తూ వొడ్డెక్కి, మందహాసం చేస్తూ "సెలవ్" అంది జానకి.

దానిమీద, రంగనాయిక "మంచిదమ్మా, మంచిదమ్మా" అంటూ ఆనందవిహ్వల అయి, రెప్ప వెయ్యకుండా జానకి వయ్యారినడకలు చూస్తూ వొక్కక్షణం అక్కడే—అలాగే నిలిచిపోయింది.

తరవాత, చిన్నప్పుడు—అంటే సంబంధం స్థిరపడ్డాక, పార్వతీశం వీధిలో వెడుతూ వుంటే తలుపు చాటున నక్కి తాను చూపించిన విలాసచేష్టలు

మననం చేసుకుంటూ వైశ్య స్త్రీలు రేవులోకి రాకముందే వొడ్డెక్కి, వారు పలకరించి అపుచేస్తారేమో అని వొకపక్కకి తప్పుకుని తెరసిమరుపుల్లో యింటికి వెళ్ళిపోయిం దామె

13

"చెవు డెప్పణ్ణుంచె మాతల్లీ?"

"నాలుగు దినాలనుంచండీ మామ్మా"

"ఇక కళ్ళుకూడా—"

"నాకళ్ళు పోవా లని వుందా?"

"నీకళ్ళు పోతే నాకేం వస్తుందీ. నాకళ్ళే పోవాలి"

"మీకళ్ళు పోతే మాత్రం యేమివస్తుందీ?"

"వస్తే వస్తుంది, లేకపోతేలేదు; కాని యిలాగ చూడూ"

"దినమ్మా యెందుకమ్మా! ఇవాళ విడిమొగ్గలుకాదు—దండలు కూడా గుచ్చి—శాబాసు"

"ఇది కూడా చూడూ"

"అదేమి టండోయ్?"

"వోస్! ఏమీ యెరగవు పాపం!"

"నిజం అక్కయ్యగారూ"

"అబద్ధం చెల్లయ్యగారూ"

ఒక్కమాటు గంభీరంగా చూసి, వొక్కమాటు చిరునవ్వున్నా నవ్వుకుని "మీదయ అలావుందన్నమాట. పోనీ, యిలాతెండి" అంటూ మల్లెదండల పొట్లమూ గంధపుగిన్నీ మెల్లిగా అందుకుని, జానకి, అవి మార్బిలు బల్లమీద వుంచింది.

"గంధంపరిమళానికి వీధిపొడూగునా అందరూ విరగబడి చూడ్డమే. సిగ్గేసింది నాకు"

"పా—పం"

"తెచ్చినందుకా?"

"చూ—శారా? ఇవాళ యిలా మొదలుపెట్టా రేమిటి అక్కయ్యగారూ?"

"నీబెల్లింపుల కేం గానీ—మరి చూస్తూ నుంచుంటే కాదు, తలకూడా నేనే దువ్వాలిట"

"అయితే గుర్రం దిగండి"

ఇలా అంటూ జానకి వెనక్కి తగ్గగా "అదేమిటి చెల్లీ?" అంటూ రత్తమ్మ తెల్లబోయింది.

"ఖరాగా వొక్క గంట కూచోవలసిందే మీరు" అంటూ మళ్ళీ యింకో అడుగు వెనక్కి వేసింది జానకి.

"ఏంచేతా?"

"ఇంటో లేరండి"

జానకి యిలా అనేటప్పటికి, రత్తమ్మ చకిత, అయి వొక్క క్షణం స్తబ్ధత కూడా అయి వుండిపోయి, చివరికి "వోసినీయిల్లు బంగారం అయిపోనూ, నీకే తల దువ్వడం" అంది నెమలిలాగ.

"మరి ఆమాట ముందు చెప్పారా మీరు?" అని ముదలకించింది జానకి.

"వొకరిమాట మాత్రం చెప్పానా యేమిటి నేను?"

"చెప్పకపోతే? ఈదండా యీగంధమూ యెవరికో—"

"అవి మీకిద్దరికీ గాని అతని కొక్కడికీనా?"

"అయితే, తలకూడా మాకిద్దరికీ దువ్వాలన్నమాట, తెలుసా మరి?"

"నువ్వేమన్నా నాకుతెలుస్తుంది. వెర్రితల్లివి. మాయా మర్మమూ యెరగవు పాపం. తొరగా కూచో అమ్మా, పిండికూడా విసురుకోవాలి యింటికి పోయి"

ఇలా అంటూ దగ్గిరికి వెళ్ళి రత్తమ్మ గడ్డం పట్టుకోగా ఆమె రెండు చేతులూ పట్టుకుని "ఈపూట మాయింటోవుండండక్కయ్యగారూ" అంటూ జానకి ప్రాధేయపడింది.

"అమ్మ కనిపెట్టుకుంటుం దమ్మా?"

"మీమరిదివెళ్ళిపిలుచుకువస్తారులెండి దొడ్డమ్మగారిని"

"ఇప్పుడు కాదు, మరోనాడు వస్తాములే, తొరగా కూచో అమ్మా?"

"నేను తప్పుమాట అన్నానా అక్కయ్యగారూ?"

"తప్పుమాటా? ఏంతమాటా? రంగమ్మ కనిపెట్టుకుని వుంటుందమ్మా నేను వెళ్ళేదాకా. ఇక్కడ యేంజరిగిందో తెలుసుకుని గాని యింటికి వెళ్ళదుట"

"అమ్మయ్యో, అయితే, మిమ్మల్ని క్షణంలో పంపేస్తాను బాబూ! అదెంత కంగారు పడుతోందో పాపం. వలవల యేడ్చేసిం దండీ అక్కయ్య. చూడలేక పోయానండీ అక్కయ్యగారూ"

అంతా చెప్పింది రంగమ్మ. నువ్వు పార్వతీదేవివిట. చిన్నదానవని వూరుకుందిట, లేకపోతే నీకాళ్ళమీద పడునుట. మళ్ళీజన్మకి నీకడుపున పుడుతుందిట దేవుడితో దెబ్బలాడి"

"పా—వం"

ఇలా అంటూ బొట్టుపెట్టి అగరునూనె సీసా తెచ్చి దగ్గిర పెట్టుకుని అద్దంయెదుట కూచుంది జానకి.

ఏమిటేమిటో అడుగుతూ, యేమిటేమిటో చెబుతూ, అమాయికాలైన ఆమె కళ్ళల్లోకి మధ్యమధ్య గంభీరంగా చూస్తూ, వెక్కిరిస్తూ, వేళాకోళాలాడుతూ, క్షణంలో తలదువ్వేసి, ఆమె మొగం కడుక్కువచ్చి కాటుక పెట్టుకోగా బొట్టున్నూ పెట్టి, ఆవిభ్రమవిలాసాలు చూసి విస్తుపోయి, చివరికి "మరిపోతా" అంటూ రత్తమ్మ చక్కాపోయింది.

14

రాత్రి పదిమ్మొప్పావు.

గాసుదీపం వెలుగు, గదిలో పురకలు వేస్తోంది.

వట్టివేళ్ళ తడకలు అప్పుడప్పుడే తడపడంవల్ల, పిల్లగాలి, కషాయగంధబంధురమై చల్లగా వీస్తోంది.

ఇలాంటి సమయాన, పొట్లం విప్పి మల్లెదండలు పార్వతీశం పక్కగా పక్కమీద వుంచి, గంధపుగిన్నె పట్టుకుని చిరునవ్వు నవ్వుతూ యెదట నుంచుంది జానకి.

ఆమె చూపుల్లో యేదో వొక గంభీర ప్రశ్న కనబడగా అదేమిటా అని ఆలోచిస్తూనే జానకమ్మకి చెయ్యి అందించాడు పార్వతీశం.

జానకి చందనచర్చ ప్రారంభించింది.

"గంధంలో యేమిటో కలిపా" వన్నా డతను.

"ఇవాళ కొత్తా"

"ఏమిటో అంటే యేదో కొత్తరకం అన్నమాటండి"

"ఇవాళకొత్తా అంటే ఆదేమిటో చెప్పుకో మన్న మాటండి"

"వోస్‌ః ఇదే చెప్పుకోలేకపోవాలి"

"వోస్‌ః తెలిస్తే చెప్పడాని కింత సేపు కావాలి"

"....................."

"....................."

"తెలిసిపోయింది"

"చెప్పేశారు"

"చెప్పక? పారిజాతం"

"పకుళం కాదూ?"

"అవునవును. పొరపాటే. రెండూకలశాయి సమంగా"

"....................."

"అకలుపే యీకలపానికి అందం తెచ్చింది."

"....................."

"కాని. కొంచెం తక్కువ వెయ్యవలసింది. ఎక్కువయి కొంచెం మొగంమొత్తుతున్నట్టుంది.

"అదో రుచి. దినమ్మూ వొక్కటే అయితే — వొక్క మోస్తరే అయితే మొగంమొత్తదా యేమిటి?"

చకితుడై పార్వతీశం ఆమె కళ్ళల్లోకి చూశాడు.

ఆమె చూపులు మళ్ళించుకుంది

"ఉడుకులాం మాత్రం మోతాదుగానే పడింది. మొత్తానికి గంధం భేషుగ్గానే వుంది"

"ఈమాట యెప్పుడూ వుంటుందా?"

"ఏం వుండకా?"

"నిన్న నేమన్నారో?"

"నేనిప్పటికీ ఆమాటే అంటాను, వట్టివేళ్ళతడక లావరసని గుబాళిస్తూ వుంటే గంధలో యెవరయినా వట్టివేళ్ళ అత్తరు కలుపుకుంటారా?"

"అలా చూడండీ"

ఇలా అంటూ, తర్జనీనిర్దేశంతో విరగబూసివుండిన పొగడ చెట్టు చూపించిం దామె.

"అయితే?" అన్నా డతను.

"ఇక నేను మాట్టాడను"

"మాట్టాడవా, చెప్పవా!"

"పోనీ, చెప్పనండీ"

"తెలిసింది నువ్వు చెప్పనే అక్కర్లేదు. పొగడచెట్టు పక్కని పారిజాతం వుందా మరి?"

"ఉంటే యీకాలంలో పూస్తుందా మరి?"

గతుక్కుమన్నా డతను.

ఆమె నవ్వు ఆపుకోలేన కష్టపడసాగింది.

"ఎందు కలా నవ్వుకుంటావూ?"

"....................."

"అయ్యో"

"..................."

"పైకి నవ్వేయ్యి, కుదపడం మానేస్తుంది"

కుడిచేతి మణికట్టు నోటి కడ్డంపెట్టుకుని గంధపుగిన్నె, అతని కందించి ఆమె కూచుంది.

లేచి అతను యెదట నుంచున్నాడు.

"మంచులా వుంది గంధం"

"నీమనస్సులాగే, కదూ?"

"..................."

"..................."

"ఇక చాల్లెండి"

"..................."

"వినరూ?"

"..................."

"అబ్బా, మీగుణం పోనిచ్చుకోరు"

"నీగుణం పోనిచ్చుకున్నావు కాబోలు నువ్వు"

"..................."

"ఆలస్యం అవుతుందంతే, ప్రయోజనంలేదు తెలుసా?"

"మ – రే"

"..................."

"..................."

"గంధపుచలవకి కుడిచెయ్యి కొంకర్లుపోయింది; కాని చివరికాబాధ తీరింది"

"తీరదూ, యివతలివాళ్ళు మెత్తనివాళ్ళయితే?"

"అబద్ధం ఆడకు"

సిగ్గుపడిన్నీ తీక్షణంగాచూసి మొగంవంచుకుం దామె.

కొంచెం సాగి, గంధపుగిన్నె బల్లమీద వుంచేసి మల్లెదండ లందుకున్నా డతను.

ఉభయులూ వొకరికొకరు దండలు వేసుకున్నారు.

"అదృష్టం లేకపోయింది; గాని పూలదండలు కట్టడంలో మాత్రం మంచి నేర్పే వుంది రత్తమ్మ వదినకి"

"మెచ్చుకోవడంలో మీకూ చాలా నేర్పే వుంది; కాని అదృష్టం తారుమారయి కష్టం వొకరిదీ మెప్పు మరొకరిదీ అయిపోయింది"

దీనికి చకితుడై చూశా డతను.

"ఏం, అలా చూస్తారేం?"

"నువ్వే కట్టావా?"

"కా" దన్నట్టు తల అడ్డంగా వూపిం దామె, చిరునవ్వు నవ్వుతూ.

"మరెవరు కట్టారూ?"

"వోతాయిలంగారు"

"అంటే?....... తెలవలేదు చెప్పాలి"

"ముహూర్తం దాటిపోతే మొదలే చెడిందీ? ఆవిడా"

"ఏమిటీ?" అంటూ వులిక్కిపడ్డా డతను.

"మరేమనుకున్నా" రన్నట్టు తల యెగరవేసుకుం దామె.

"గంధం కూడా—"

"ఆవిడే వంపారండీ"

నిర్విణ్ణు డయిపోయా డతను

"బాగున్నాయి, కదూ?"

"...................."

"సంతోషించినట్టేనా?"

పార్వతీశం గంభీరంగా చూశాడు.

అంతకంటేనూ గంభీరంగా చూసింది, జానకి.

"ఏమవుతుందో యెరుగుదువా?"

"ఇదివరకే అనుకుంటున్నాం మేము 'వొ సే చెల్లాయీ' అంటే 'వొ సే అక్కయ్యా' అని"

"...................."

"ఏం, వూరుకున్నా రేం?"

"...................."

"మన యింటికి వచ్చేస్తుందిట"

"...................."

"మాట్టాడ రేమండీ?"

"వెర్రీ కాదు, వేషమూ కాదు నీది"

"చిన్నప్ప డెంతో ఆశపెట్టారుట. ఉసురుతగలదూ? ఆడదా న్నేడిపిస్తే జయం కలుగుతుందిటండీ?"

"దేవుడు చేసినదాని కెవరేం చేస్తారూ?"

"అన్నిటికీ అంతేనా?"

"...........నీసంగతి ఆలోచించుకున్నావా?"

"వండి పెడుతూ యిద్దరికీ చాకిరీచేస్తాను"

పార్వతీశం వొక్క-క్షణం దిగ్భ్రాంతు డయివుండి, వుత్తర క్షణంలో ఆవేశంతో ఆమెని పొదువుకున్నాడు.

ఆబాహుబంధంలో ఆమె నిలువునా కరిగిపోగా, తామర తూడుకంటేనూ మృదువుగా వున్న ఆమెని మరింతగట్టిగా కౌగలించుకుని, అరమూతలుపడ్డ ఆమె కళ్ళమీద అతను, కమ్మనిముద్దులు గుమ్మరించాడు.

15

తెల్లవారింది.

ఊరికే కాదు, నిద్రపట్టనివ్వక అక్కడ రంగనాయికనీ యిక్కడ జానకినీ పక్కనిబెట్టి రాసేసి మరీ తెల్లవారింది.

వెంటనే స్నానాదికం ముగించుకుని, చద్ది భోంచేసి, అలారం దిద్ది, బేరగాళ్ళు రాగా బెల్లం తూపించివెయ్యడానికి గరువుమీదికి వెళ్ళిపోయాడు పార్వతీశం.

పనిలో పని జానకమ్మ కూడా యథాపూర్వకంగా యేకబంతి కానిచ్చేసి మెల్లిగా బీరువాదగ్గిరికి చేరుకుంది.

మొదట, ఆమె వీరేశలింగంపంతులు చరిత్ర తీసింది.

తరవాత, వచన భారతం స్త్రీపర్వం తీసింది.

వచన రామాయణం సుందరకాండ అందుకుంది.

రుక్మిణి కల్యాణమూ పుచ్చుకుంది.

కాని వొక్కటీ – పదిబంతులూ నడవలేదు.

విసిగిపోయి చివరికి వీణ అందుకుంది.

శ్రుతిసరిచేసి "యేమిటీ అందుకోడం" అన్నట్టు పైకిచూడగా, గోడమీది పటంలో, సరోవరంలోకి కాళ్ళు చాచుకూర్చుని చెవులొరచేసుకొని వేణుగానం ఆలకిస్తూ వొంటిమీద బట్టవున్నదీ లేనిదీ ఎరగని స్థితిలోవుంది రాధ.

తమాలవనంలోనుంచి దూసుకువస్తోంది ఆ నాదం.

ఆభావన జానకమ్మ కంఠాన ఆవర్తాలు రేపింది.

వెంటనే ఆ వినవడుతున్నట్టున్న రాగం అందుకుని అలా చూస్తూనే వీణ మీటసాగిం దామె.

రెండుమూడు నిమిషాలు గడిచాయి.

ఉల్లాసంగానే గడిచాయి; కాని రాధ కళ్ళల్లో ఆ వేణుగానలోలుని కోసం సుడితిరుగుతున్న ఉత్కంఠత గోచరించింది.

దాంతో, బాష్పప్లావితాలైన రంగనాయిక కనుదమ్ములు స్ఫురించి మనస్సు చెదిరిపోయింది.

ఇక వీణ మీటలేక పోయింది.

ఉబ్బెత్తుగాలేచి వాకట్లోకి వచ్చి చూడగా పదినిమిషాలు తక్కువ యెనిమిదే అయివుంది.

విసిగిపోయి యాదాలాభంగా కిటికిలోనుంచి వీధిలోకి చూడగా బిందె పుచ్చుకుని చెరువుకి వెడుతూ వొక యువతి కనపడింది.

తనలాగే ఆవూరికి కొత్త కోడ లామె.

తరుచు చెరువుదగ్గిరే కలుస్తూ వుంటుంది.

ఆమె కూడా సంగీతం చెప్పకుంది.

గాత్రాన పాడుతూ ఫిడేలు వాయిస్తుంది.

"వెళ్ళిపోతుంది" అన్న ఆత్రంతో గభీమని తలుపు తీసి "యిలా రావే వొయ్యారిభామా" అని పిలిచింది జానకి, చనువుగా.

ఇద్దరూ చీడీలమీదికి కాళ్ళుంచుకుని దగ్గిరదగ్గిరగా కూచున్నారు.

ఏమిటేమిటో చెప్పకున్నారు.

ఎందుకెందుకో నవ్వకున్నారు.

బుగ్గలు నొక్కుకున్నారు.

కళ్ళు తిప్పకున్నారు.

బుంగమూతి పెట్టుకున్నారు.

"నీ చీర యెంతే?" అంటే "నీ పైటపరికిణీ యెంతయిందే? అనిన్నీ ప్రశ్నించుకున్నారు.

తరవాత యేదోమాట చెబుతూ చెబుతూనే "మరి పోతా" నంటూ లేచి నుంచుంది ఆపిల్ల.

"కాస్సేపుండవే" అంది జానకమ్మ.

చెయ్యిపట్టుకు లాగింది; కాని ఆమె నుంచోలేదు

దానిమీద "పదింటికే భోజనంచేస్తే తరవాత యెంతసేపటికి పొద్దు గూకనే వోసెమ్మా" అని సాగతీసుకుని, అడుగడుక్కీ ఆగి వెనక్కి తిరిగి చూసి మరీ జవాబులు చెప్పవలసిన అభూతప్రశ్నలు శరపరంపరగా అడిగి,

యిక లాభం లేదని తోచగా "మరి వెళ్ళిరా పాపం, మీ ఆయన యెదురు చూస్తూ వుంటారు" అని సెలవిచ్చింది.

ఇంతచేసినా, గడియారం చూడగా యెనిమిదీ ముప్ఫయిరెండు నిమిషాలే అయివుంది.

మళ్ళీ చిరాకుపడిం దామె.

నిజంగా, ఆమె చాలా నెమ్మదయిన పిల్ల కనక సరిపోయింది; కాని మరో రకం అయితే గడియారం పుచ్చుకుని నేలబెట్టి కొట్టేసి వుండును.

అక్కడికీ "అలారం కొట్టేదాకా దీనిమొగం చూడగూడ"దని కొట్టినంత పని మాత్రం చేసి గదిలోకి చక్కా వెళ్ళింది; కాని అక్కడా ఆమె కేమీ తోచలేదు.

కుర్చీ అనుకునుంచుని "రత్తమ్మక్కయ్యగా రయినా రాకూడదూ యిలాంటప్పుడూ?" అని వోమాటనుకుంది.

"బేరగాళ్ళు మధ్యాహ్నం వస్తే యేమో?" అని వోమా టనుకుంది.

చివరికి "పోనీ, రెండుప్లేట్లు వేసుకుందా" మనుకుంటూ ఫోనుదగ్గిరికి వెళ్ళింది.

వెళ్ళిందే కాని తెమల్చుకో లేకపోయింది.

"గాత్రమా, వీణా, ఫిడేలా, గోటా, వేణువా?" అని జిజ్ఞాస వచ్చిందక్కడ.

దాల్లో నాలుగు నిమిషాలు గడిచిపోయాయి.

చెయ్యి పెట్టాటప్పటికి సంగీతం లేకుండా భమిటిపాటి కామేశ్వరరావు గారు, కంకంటి పాపరాజు ఉత్తరరామాయణంలోనుంచి ఎత్తిచదివిన సీతమ్మ శోకంప్లేటు వచ్చింది.

అదయాక, యేదో యింగ్లీషు సంగీతంరికార్డు వచ్చింది.

ఇలాగ రెండు మూడు ప్లేట్లు వేశాటప్పటికి "నాయెదుట మరొకళ్ళ పాటా?" అన్నట్టు వాకట్లో గడియారం సాగదీసి అలారం పాడింది.

వెంటనే యెక్కడిప్లేటు అక్కడే – యెలా వున్నఫోను అలాగే వుంచేసి, బిందె బుజాన వేసుకుని, మనస్సులో చాలా తొందరపడుతూ, అడుగులు మాత్రం మెల్లిగానే వేస్తూ చెరువుకి బయలుదేరింది జానకి.

16

అప్పడికప్పడే — పావుగంటకి ముందే వచ్చి అక్కడ కూచుని వుంది రంగనాయిక.

పావంచాలమీద కూచుని, మాటిమాటికీ లేచి చూస్తూ అవసరంలేకపోయినా బిందె తోముతూ ఆత్రపడిపోతోందామె.

జానకి కనపడేటప్పటి కామె మెరుపయిపోయింది.

రంగనాయిక కనపడేటప్పటికి జానకీ సంబరపడింది.

వెంటనే "ఎంత సేపటికి రాకపోతే యెలాగే మాతల్లీ?" అంటూ వొకరూ "తొమ్మిదిన్నర కాందే వచ్చి యేం చెయ్యనూ? కాకపోయినా, నువ్వు ఇవాళ తొరగా వస్తావని నేనేం కలగన్నానా?" అంటూ వొకరూ లేచి గభీమని కౌగిలించుకున్నారు.

ఆ వెంటనే చెరువులో కూడా దిగి గుండెల్లోతుకి వెళ్ళి నుంచున్నారు.

అప్రయత్నంగా వొక్కమాటు కంఠందాకా మునిగిలేచారు.

"ఏం జరిగింది చెల్లీ?" అంటూ ప్రారంభించింది రంగనాయిక, జావ్యం సహించలేక.

"నేను చెప్పలేదూ?" అని జానకి యెదు రడిగింది. దీంతో, యిద్దరూ వుక్కిరి బిక్కిరి అయిపోయారు.

అప్పుడు "వివరంగా చెప్పవుటే చెల్లీ?" అంటూ రంగనాయిక గడ్డం పట్టుకోగా, అంతఃపురంలోనే వుండిపోవలసిన సంగతులు తప్ప తతిమ్మా — జరిగిం దంతా — వొక్క అక్షరమయినా విడిచిపెట్టకుండా — పైపెచ్చు కళ్ళు తిప్పుకుంటూ మరి కొన్ని అక్షరాలు కలిపి అతిరసవంతగా చెప్పింది జానకి.

మొదట రంగనాయిక మొగాన ఆనందం మెరిసింది.

దాంతో, ఆమె కళ్ళు అరమూతలు పడ్డాయి. చేతులు గోయిలించు కున్నాయి.

తరవాత — వెంటనే — కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రావిరేకల్లాగ పెదిమలు వొణికిపోయాయి.

కంఠం గద్గదిక మయిపోయింది.

ఇందుకే జానకి అప్రతిభ అయిపోగా, రంగనాయిక, అతి కష్టంమీద తెరిపిచేసుకొని "చెల్లీ, ఇక యీజన్మ కింతే అని నిరాశ చేసుకుని వుండగా నువ్వు నన్ను స్వర్గాని కెక్కించావు. ఏమిచేసిన్నీ నీరుణం తీర్చుకోలేను. ఇవి చేతులుకావు, కాళ్ళు" అని రెండు చేతులూ పట్టుకుని మరి మాట్టాడలేకపోయింది.

జానకమ్మ కూడా నీరవురా లయిపోయింది.

ఒక్క నిమిషం యిద్దరూ అలాగే వుండిపోయారు.

పైట సవరించుకుంటూ తరవాత "చెల్లాయీ! నేనిక వెడతానే. మా ఘరదలు పుట్టింటికి వెడుతుం దివాళ. అది వెళ్ళాటప్పు డింటో వుండకపోతే

బాగుండ దమ్మా! అసలే అది కజ్జాకోరు. నన్ను చూస్తే దాని కళ్ళు మిటమట్టాడ తాయి కూడాను. కనక, మళ్ళీ రేపు. ఎలాగో వీలుచేసుకుని రేపు మీయింటికే వచ్చేస్తాను. ఏమీ అనుకోకేం? తప్పులుంటే మరిచిపోవేం? అక్కయ్యమీద దయవుంచేం?" అంటూ గడ్డంపట్టుకుని బతిమాలి, బిందె ముంచుకుని, మెల్లిగా పావంచా లెక్కి పదిగజాలకోమాటు ముసిముసి నవ్వులతో తిరిగితిరిగి చూస్తూ వెళ్ళలేక వెళ్ళలేక బలవంతాన వెళ్ళిపోయింది, రంగనాయిక.

అప్రతిభ అయిపోయి అలాగే నుంచుంది జానకి.

"మీఅక్కయ్య, మరదళ్ళ క్కూడా లోకువయిపోయిది చూశావా?" అని యెవరో అడిగినట్టయిం దామెకి.

దీంతో, ఆమె నరాలు పొంగిపోయాయి.

కళ్ళల్లో రోషం ఆవరించింది.

ఆకళ్ళకి, మరదళ్ళు, చీపురుకట్ట. పుచ్చుకుని రంగనాయికను తరుము తున్నట్టు కనపడింది.

మనస్సు గుబగుబ లాడిపోయింది.

వెంటనే చరచరా బిందె ముంచుకుని, గబగబా యింటికి వెళ్ళిపోయిం దామె.

17

సాయంత్రం ఆయిదున్నర గంటలవేళ, పార్వతీశం, పొలంనుంచివస్తూ బలరామిరెడ్డి అనే మిత్రునితో కూడా సూరావధానులుగారి పెద్దదొడ్డిదగ్గిరికి వచ్చేటప్పటికి, దొడ్డిగుమ్మాన నుంచుని వుండిన పనిమనిషి "బాబయ్యా" అని సంబోధించి, రెడ్డికేసి చూస్తూ యేదో నసికింది.

అది విరోధుల యింటి పనిమనిషి కావడంవల్లా, విరోధుల స్థలంలో నుంచుని వుండడం వల్లా తనని కాదనుకునిన్నీ "యేమిటి?" అనడిగాడు పార్వతీశం.

రెడ్డికేసి చూస్తూ ఆమె మళ్ళీ నసికింది.

అది యేదో చెప్పతలుచుకుం దనీ, రెడ్డి వున్నందుకు. సందేహిస్తోం దనీ గుర్తించి "తొరగా చెప్పు భయంలేదులే" అన్నాడు పార్వతీశం.

అయినా ఆమెకి తృప్తి కాలేదు; కాని చేసేది లేక అపవారించి "మిమ్మల్ని రంగనాయికమ్మగారు పిలుస్తున్నా"రంది.

పార్వతీశాని కంతా అర్థం అయింది.

అయినా "యెందుకూ?" అనడిగాడు.

"ఏమో బాబూ"

"ఎక్కడుందీ?"

"ఈదొడ్లోనే" అంటూ తలుపు నెరిచి పనిమనిషి లోపల అడుగు పెట్టింది.

మిత్రులు నేత్రావధానం చేసుకున్నారు.

అది వోపట్టాన పూర్తికాకపోయినా చివరికి "వెళ్ళవ"ద్దన్నట్టు రెడ్డి మొగం పక్కకి తిప్పుకున్నాడు.

అది పార్వతీశం కాళ్ళకి బందం అయింది.

నిజానికి అతని అభిప్రాయమూ "వెళ్ళకూడ" దనే; కాని, అతను రెడ్డి కేసి చూస్తూనే వుండగా - అంటే రెడ్డి అతనికి కనపడుతూనే వుండగా - అదనంగా "రారూ?" అంటూ దోసిలి వొగ్గి రంగనాయిక ప్రాధేయ పడుతున్నట్టూ "వెళ్ళకపోతే నేనొప్పుకోను సుమండీ" అంటూ జానకి ఆజ్ఞాపిస్తూ వున్నట్టూ కనపడింది.

ఆగలేకపోయాడు.

వెంటనే ముందు పనిమనిషీ, యెవరయినా చూస్తున్నారేమో అని వొకమాటలాగా యిలాగా చూసి తరవాత పార్వతీశమూ దొడ్డోకి బయలు దేరాడు.

చేసేదిలేక "జాగ్రత్తసుమండీ" అని మాత్రం అని, రెడ్డి, ఆగుమ్మాని కెదురుగా వున్న సందు మొగకి వెళ్ళాడు.

* * *

రివ్వునవచ్చి సంపంగిపరిమళం ఘ్రాణతర్పణం చేసింది.

రువ్వున వచ్చి కాకి అరుపు కర్ణవిదారణం చేసింది.

అది మనస్సు కుల్లాసం కలిగించగా, యిది హృదయంమీద దెబ్బ కొట్టింది.

మరొక డయితే యేమిచేసునో గాని పార్వతీశం ముందుకే అడుగు వేశాడు.

పెరిగిపెరిగి చివరికి మొగ్గతొడిగిన ప్రేమ వికసించగా రంగనాయిక కళ్ళనిండా చూసింది; గాని వల్లమాలిన సిగ్గు వచ్చి ఆమె మొగం వంచేసింది.

అయితే, తన సమీపానికి రావడంలో అతను కనపరచిన ద్రుతగతి చూసి, అతను, ముందు తనని గుచ్చి కౌగిలించుకుని, ముద్దాడి, తరవాతే మాట్టాడతా డనుకుని, ఆసిగ్గుచాటున మురిసిపోతూ నిరీక్షించింది

పట్టరాని ప్రేమ వుండి, నిగ్రహించుకోరాని సాహసం పుడితే తప్ప స్త్రీ— అందులోనూ లేజవరాలు ప్రియుణ్ణి రమ్మని ఆహ్వానించలేదు కనక, తనని

చూడగానే ఆమె స్వయంగ్రాహం చేసే మాట్టాడుతుందని - సంఘం తలుచుకుని జంకుతూ కూడా అతనెంతో ఆశించాడు; కాని మిడుతూ మిడుతూచూస్తూ చివరి కిద్దరూ బొమ్మలయి వుండిపోయారు.

చూసిచూసి "పాపం సిగ్గుపడుతున్నా"రనుకొని పనిమనిషి తప్పుకుంది.

అప్రయత్నంగా ఒలాగ ఏకాంతస్థితి సంభవించినా మరో అడుగు ముందుకువేసినీ చివరికతను "ఎందుకూ రమ్మన్నావుటా?" అనడిగాడు.

ఈమాట ధన్నుమని హృదయంమీద కొట్టినట్టుకాగా ఆమె నీరవురా లయిపోయింది.

"రమ్మనడం నిజమేనా?" అని మళ్ళీ అడిగాడతను.

ఏమిటేమిటో మాటలు తోచి నిర్ధారణ కాక అప్పుడూ ఆమె బదులు చెప్పలేకపోయింది.

"పనిమనిషి అబద్ధం చెప్పినట్టుంది" అని గంభీరంగా చూశాడతను.

ఇది విని వెళ్ళిపోతాడేమో అని ఆదుర్దాపడుతూ అటూ యిటూ చూసిం దామె.

ఆచూపులతని హృదయం కలిచేశాయి.

వెంటనే వొక్క అంగలో వెళ్ళి అతనామె చెయ్యి పట్టుకున్నాడు.

అందుకామె సిగ్గుపడి మొగం పక్కకి తిప్పుకుంది.

అయినా, ఆ మొగం వికసించివుండడం గుర్తించి గభీమని పొదువుకుని గుండెలకదుముకుని, "రంగా, నేనిక్కడ ఆట్టే సేపుండడం మంచిదికాదు. నువ్విది యోచించావా?" అనడిగాడు.

"ఇప్పటికా దయవచ్చింది?"

"ఎప్పటికయినా నీదయ ముందు నాదయ యేపాటిదీ?"

"కోటిగుణితం"

"................"

"ఇప్పటిదాకా నాకళ్ళు మాత్రమే చల్లగా వున్నాయి, ఇప్పుడు హృదయం కూడా చల్లబడింది"

"................"

"ఎంతో ఆశపడ్డాను. చివరికి నాఆశలన్నీ మంచు విడిపోయి నట్టయి పోయాయి; కాని నేటికి చెల్లాయి అనుగ్రహం—"

మాటసగంలో అందుకుని "దీని కేం చెప్పాలో నాకు తోచడం లే"దన్నా డతను.

"బెంగపెట్టుకో వద్దంటే చాలు"

ఆమె వోరచూపులే చూస్తోంది.

ఆచూపులయినా లజ్జాముద్రితాలుగానే వున్నాయి; కాని ఆమెచేతులు తన నడుముకి చుట్టుకోవడమూ, ఆమె శరీరం తన శరీరంలో ఇమిడిపోతూ వుండడమూ గుర్తించి "నీసాహసం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. నీప్రేమ తిరస్కరించ లేకుండా వున్నాను; కాని గందరగోళం పుట్టవచ్చు"నంటూ మొగం పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడతను.

అయితే "గందరగోళంపుట్టవచ్చు" నేమిటి విరుచుకుని మీద పడేపో యింది.

పార్వతీశం యిలా అనేటప్పటికి "ఎవడవురా నువ్వు? నాదొడ్డో కెందుకు వచ్చావురా బుద్ధి హీనుడా?" అంటూ వొక రంకె వినబడింది.

చూడగా, రంగనాయిక మూడో అన్న వెంకటేశం, ఆబోతులాగ మీదికి వస్తున్నాడు.

అయితే పార్వతీశం రంగనాయిక పిలు పెలా అంగీకరించాడో వెంకటేశం పిలుపూ అలాగే అంగీకరించాడు; గాని రంగనాయికను విడిచి బట్ట ఎగగట్టి ప్రేమస్థానే రోషం జ్వలింప చేసుకుని, ఆనందార్ద్రాలయిన నేత్రాలు జోతులు చేసుకుని, దరహాసతరళిత మైన అధరం శౌర్యస్ఫురితం చేసుకుని, ప్రేమాద్వైత సాధన వ్యగ్రాలయిన చేతులలో వజ్రముష్టి సంఘ టించుకుని "రారా అప్రాచ్యుడా" అని మోహరించాటప్పటికి మీదే పడ్డాడు.

18

రంగనాయిక కొయ్యయిపోయింది.

ఆమెకళ్ళు సిగ్గు పడుతున్నాయి. చెమ్మగిల్లుతున్నాయి. నిప్పులు కక్కుతున్నాయి. చెదిరిపోతున్నాయి కూడాను.

అప్పటికప్పుడే వారు ద్వంద్వయుద్ధం సాగిస్తున్నారు.

తనదొడ్డి అని వెంకటేశం భరవసా.

తనప్రియురాలి సముఖం అని పార్వతీశం దిలాసా.

దీనికి తోడు, వెనక్కితీస్తే రంగనాయిక "ఛీ" అంటుందేమో అని యిద్దరికీ వల్లమాలిన శౌర్యం.

దీంతో ముఖాముఖీ అయీఅవడంతోటే బాహా బాహీ; కచాకచీ, ముష్టా ముష్టీ, పదాపదీ అయిపోయి, యిద్దరూ కూడా మాం —— చి ముమ్మరంలో వున్నారు కనక కొమ్మ టేనుగుల్లాగ కుమ్ముకోసాగేరు.

రంగనాయిక ప్రకృతిలో పడింది.

సరిగ్గా ఆమె చూపులకు మళ్ళీ నైశిత్యం అబ్బేటప్పటికి పార్వతీశం, వెంకటేశాన్ని, క్రాపింగు పట్టుకుని వంచి వీపుమీద నాలుగైదు వీసెగుద్దు లుంచాడు.

ఆవంగిపుండడమే వొక వుపాయంగా యెంచుకుని, పార్వతీశాన్ని కూలగొడదా మని వెంకటేశం అతని రెండుకాళ్ళూ పట్టుకున్నాడు.

అయితే, వెంకటేశం చేతులు తన కాళ్ళకి చుట్టబెట్టుకోడంతోనే నడుము పట్టుకుని పార్వతీశం, వెంకటేశాన్ని యెత్తి కుదేశాడు.

రంగనాయిక కళ్ళు చిరతలు కమ్మాయి.

పార్వతీశం రోషస్ఫులింగాలలో గర్వప్రభ మెరిసింది.

ఆపడ్డపాటునే రెండు తన్నులు తగిలిద్దామని పార్వతీశం కాలెత్తాడు; గాని అంతలో జ్ఞాపకం వచ్చి, తటాలున రంగనాయిక కేసి చూసి ఆమె మొగాన సంబరానికి బదులు కలవరం వుండడం గుర్తించి వూరుకున్నాడు.

వెంకటేశానికి చచ్చినచా వయింది; క్రోధంపోలేదు.

మళ్ళీ నిప్పులు క్రక్కుతూ లేచా డతను.

పార్వతీశంమీద పడదా మని వూగీసలాడాడు; కాని హఠాత్తుగా పతకం మార్చుకుని 'లాంజముండా" అంటూ రంగనాయికమీది కురికాడు.

అదిచూసి పార్వతీశం అగ్గయిపోయాడు.

అంతకిముందే రంగనాయిక తప్పించుకోవాలని చూసింది; కాని దొరికి పోయింది.

వెంకటేశం ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

ఒక్కక్షణం వుంటే రంగనాయిక వెంకటేశాన్ని చూపులతో కాల్చే సునో, పెనగులాడునో, యేడుస్తూ కూలబడునో, కాని పార్వతీశం అది చూడ లేకపోయాడు.

వెంటనే వెంకటేశం రెక్కగూటిమీద వొక్కపోటు పొడిచాడు.

తరవాత అతని గజ్జల్లో వొక తాపు తన్నాడు.

దీంతో, వెంకటేశం రంగనాయికను విడిచి పార్వతీశంతో కలియబడ్డాడు.

ఇద్దరికీ రోషం పెచ్చిపోయింది

ఇద్దరూ జుట్టుపట్టుకుని వంచుకున్నారు. తన్నుకున్నారు. గుద్దుకున్నారు. గెంటుకున్నారు.

రంగనాయిక అప్పుడు మళ్ళీ వొకమాటు దిగ్భ్రాంత అయి, అంతలో మళ్ళీ ప్రకృతిలో పడి, పార్వతీశమే పైచెయ్యిగా కనపడుతూ వుండినా

కంగారుపడి, వెంటనే వీధిలోకి వచ్చి, యెదటిసందు మొగని బలరామరెడ్డి కనపడగా ధైర్యం తెచ్చుకుని, యెవరికయినా వినపడిపోతుందేమో అని కంఠం నొక్కుకుని "లోపల కొట్టుకుంటున్నా" రని ఆత్రతపడిపోయింది.

ఇది వినడమే తడువుగా రెడ్డి దొడ్డోకి వురికి వొక్క వురుమురిమాడు.

అప్పటికప్పుడే ఆయాసం ప్రారంభం అయి వుండడంవల్లా. పైపెచ్చు అగ్గిపిడుగులాగ యెదుట పార్వతీశం కుడిభుజం బలరామరెడ్డి కనపడ్డంవల్లా వెంకటేశం కళ్ళూ చేతులూ తేలవేసుకోగా. ఆసందుబాట్లో మరో నాలుగు గుద్దులు గుద్ది, సాగతీసి వో—క్క తాపు తన్ని "దిక్కున్నచోట చెప్పుకో" అంటూ వెంకటేశం జుట్టు విడిచిపెట్టాడు పార్వతీశం

వొణికిపోతూ గుమ్మాన నుంచుని వుంది రంగనాయిక.

"భయపడకు" అంటూ వెళ్ళి పార్వతీశం ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"ఇది భయంకాదు" అంటూ మెల్లిగా చెయ్యి విడిపించుకోబోయిందామె.

"మా—మన యింటికి వెళ్ళిపోదాం రా" అంటూ ఆ చెయ్యి పట్టుకునే వుండి అడుగు వేశాడు పార్వతీశం.

దీంతో రంగనాయిక తేరుకుంది.

ఆమె చూపుల్లో ధైర్యమూ సిగ్గూ మెరిశాయి.

ఆస్థితిలో ఆమెకూడా వొక్క అడుగు వేసింది; కాని చురచుర చూస్తూ, తల అడ్డంగా వూపుతూ, చేత్తో కూడా నిషేధిస్తూ "ఇప్పుడు కా" దన్నాడు రెడ్డి.

"ఏం?" అనడిగాడు పార్వతీశం,

"ఇప్పుడేవస్తే దొమ్మి జరిగిపోతుంది" అని పార్వతీశానికి చెప్పి "ఇవాళకి మీ అమ్మమ్మగారింటికి వెళ్ళిపొండి. మరి నుంచోకండి" అంటూ రంగనాయకను తొందరపెట్టాడు రెడ్డి.

"కాదుకాదు, అమ్మమ్మగారి యింటికికాదు, నరసింహ దీక్షితులు మామయ్యగారి యింటికి వెళ్ళమందాం. భద్రమ్మత్త రంగమ్మ పింతల్లేగా?" అన్నాడు పార్వతీశం.

"అదిబాగుం" దన్నట్టు చూసింది రంగనాయిక.

మళ్ళీ పార్వతీశంకేసి చూసి, "వెళ్ళాలి. మరి కదలండి, తొరగా. నేను బతికి వుండగా మిమ్మల్నెవరూ యేమీ చెయ్యలేరు" అంటూ రెడ్డి తొందర పెట్టాడు.

అప్పుడొక్కమాటు పార్వతీశంకేసి గంభీరంగా చూసి రంగనాయిక, మళ్ళీ మళ్ళీ వెనక్కి తిరిగితిరిగి చూస్తూ పక్కసందులోకి వెళ్ళిపోయింది.

ఇది యిలా జరుగుతూ వుండగా పనిమనిషి వచ్చి లోపల తలుపు గొళ్ళెం పెట్టేసింది.

"భద్రమ్మగారింటికి వెళ్ళమన్నా రేం?" అనడిగాడు రెడ్డి.

"రంగనాయికని నాకివ్వనందుకు అక్కగా రని సందేహించకుండా రామసోదెమ్మత్తగారిని ఇప్పటికీ కోసి పెడుతూనే వుంది భద్రమ్మత్త"

"అయితే?"

"రాజమండ్రివెళ్ళి రంగనాయికను నేను పెళ్ళిచేసుకుంటే మద్దత్తు చెయ్య డానికి వారింటిల్లపాదీ సిద్ధంగా వున్నారు"

"సరే" అన్నాడు రెడ్డి.

వెంటనే వారిద్దరూ యెదటి సందున పడ్డారు.

మాటిమాటికీ వెనక్కి చూస్తూ "వోయ్ లచ్చిరెడ్డీ! వోరి సుబ్బారెడ్డీ, వొయ్యోయ్ కృష్ణారెడ్డీ! యేమండోయ్ సూరారెడ్డిఠాన్నగారూ" అని తనవారిని కేకవేస్తూ కూడా వెళ్ళాడు బలరామిరెడ్డి.

19

తానొక పడకకుర్చీలో వాల్తూ, రెడ్డికిన్నీ వొక పడకకుర్చీ చూపిస్తూ "ఏం, నేను తొందరపడ్డా నంటావు, కదూ?" అనడిగాడు పార్వతీశం.

"తొందరకాకపోతే?" అని ముదలకించాడు రెడ్డి.

"అప్పుడు వెళ్ళకపోతే యెందులో నయినా పడి చచ్చి పోతుంది గాని అక్కయ్య, మరేమయినా వుందా?" అనడు గుతూ మండువాచివరికి వచ్చి నుంచుంది జానకి.

"వున్నావా?" అన్నట్టు చూశాడు పార్వతీశం.

"ఆవిడా కనిపెట్టలేకపోయారు. అసలు, తోటలోనే వున్నారు వెంక టేశంగా రేచెట్టుకిందో?"

"ఏమయినా, మహా చురుకైనవాడోయ్"

"అలాగేం?"

"నిన్ను చూశాటప్పటికి మాత్రం నవనాడులూ కుంగిపోయాయి"

ఇదివిని మందహాసం చేసి "నన్ను కూడా కలిపి ఛార్జియిస్తారు. మొన్ననే పేచీపడి వున్నారు కనక వోబిరెడ్డినీ, నరసింహారెడ్డినీ కూడా కలుపుతా" రన్నాడు రెడ్డి

"అయినా, మీరేమీ తొందరపడవద్దు"

"వెంకటేశంగారి నొక దబ్బళింపు—"

వద్దువద్దు. మనం యెదిరిఛార్జీ కూడా పెట్టవద్దు.

వాళ్ళు ఛార్జీ యివ్వడమే నిరుకయితే అట్నుంచి నరుక్కురావడానికి మన కుపాయం లేకపోలేదు"

"మరి రంగనాయికమ్మగారి మాటేమిటి?"

"అదే బెంగగా వుంది. ఆమెని బాధిస్తారు"

"నీ కా బెంగ అక్కర్లేదురా బావా" అంటూ మాటలోనే వచ్చింది రత్తమ్మ.

"ఏదొడ్డోనూ కనపడకపోగా నీతో మీయింటికే వచ్చేసిందనుకున్నారు వాళ్ళు; కాని పిడపర్తివారి శ్యామలాంబ, వేమూరివారి సందులోకి వెళ్ళినట్టు చెప్పింది. దానిమీద రామస్వామీ సూరన్నా వెతకడానికి బయలుదేరగా "ఆ సంగతి తరవాత చూసుకుందాం" అంటూ నరసింహ దీక్షితులు బాబయ్య జబ్బలు పట్టుకుని వాళ్ళని వెనక్కి పంపేశాడు. రామసోదెమ్మపిన్నీ నేనూ యిప్పుడే చూసి వచ్చాం. రంగమ్మ, దీక్షితులుగారి యింటో సుఖంగా వుంది" అని వివరంగానున్నూ చెప్పిం దామె.

అది విని "అక్కయ్య భద్రంగా వుందా అక్కయ్యగారూ? రామ సోదెమ్మ పిన్నిగా రేమీ అనలేదూ?" అనడుగుతూ ఇంకో అడుగు ముందుకి వచ్చింది జానకి.

" 'నాకడుపు చెడపుట్టా' వని యేడ్చింది. 'నేసక తల యెత్తుకు తిర గడం యెలాగా' అంటూ మొత్తుకుంది"

"అక్కయ్య—"

" 'నువ్వు నాగొంతుక కొయ్యలేదూ?' అని ముదలకించింది."

ఇది విని "సెబాస్" అని చెయ్యి జాడించుకుంటూ పార్వతీశం అందుకున్నాడు.

"పరీక్షపోయినవాడితో తమపిల్ల కాపరంచెయ్యడం వారికి పనికిరాక పోయింది. మరి చచ్చినవాడి పేరుచెప్పుకుంటూ పడివుండడం ఆమెకి మాత్రం పనికివస్తుందా?"

"భద్రమ్మపిన్ని సరిగా నువ్వన్నట్టే అనలేదు; కాని చిక్కగానే చీవాట్లు—"

"ఏమన్న దేమిటి ఆవిడ?"

"మొగుడూ పెళ్ళాలని విడతీశావు నువ్వు—"

మళ్ళీ "సెబాస్" అంటూ వూగిపోయాడు పార్వతీశం.

"రంగనాయికమ్మగారు చెప్పుతో కొట్టారు సూరావధానులుగారిని" అన్నాడు రెడ్డి.

"మరి దీక్షితులు మామ యేమీ అనలేదూ?"

"అనకేం? అతను కలగజేసుకోబట్టే రామసోదెమ్మ పిన్ని చల్లగా యింటికి వెళ్ళిపోయింది, అవిడ గుమ్మం దిగుతూ వుండగా "నిన్నెవరేం చెయ్యగలరో చూస్తాను, రానియ్యవే చెల్లీ" అంటూ దుడ్డుకర్ర పుచ్చుకొని గుమ్మాన కూచున్నాడు రామచంద్రుడు"

"వాడున్నాడూ యింటిదగ్గిర?" అని యెగిరి గంతువేసి "రెడ్డి, యిక మనం నిశ్చింతగా వుండవచ్చు, రంగనాయిక పువ్వుల్లో పెట్టినట్టుంటుంది" అన్నాడు పార్వతీశం.

దానిమీద "నేనో మాటు చూసిరానా అక్కయ్యనీ ఏమండీ? మీరుసాయం వస్తారా రత్తమ్మక్కయ్యగారూ" అంటూ వుబలాటపడింది జానకి; కాని "వద్దు ఇవాళే కాదు, ఇంతట్లోనే మీరు గుమ్మం దిగడానికి వల్లకాదు" అన్నాడు బలరామిరెడ్డి.

"బోధపడిందా?" అనడిగాడు పార్వతీశం.

"అవునమ్మా, కొన్నాళ్ళపాటు నువ్వు వీధి మొగం చూడ్డానికి వీలులేదు" అంది రత్తమ్మ కూడా.

జానకమ్మ నిరుత్సాహపడిపోయి వెనక్కి తగ్గింది.

"చెల్లెమ్మగారి నిల్లు కదలవద్దన్నారు సరే. మరి దానివల్ల మీమీద యెంత పూచీపడుతోందో గ్రహించుకున్నారా?" అనడిగాడు రెడ్డి, రత్తమ్మని.

"అంటే?"

"అంటే, ఈగొడవలు పాటడిపోయేదాకా మీరిక్కడ వుండిపోవా లన్న మాట, తెలుసా?"

రత్తమ్మ నిలా అడిగి పార్వతీశం కేసి చూశాడు రెడ్డి.

"అడగవలసినమాటే అది" అన్నాడు పార్వతీశం.

ఇంతలో "ఉండండి! నాకు భయంగా వుంది మీరుండి పోవాలండీ అక్కయ్యగారూ!" అంటూ రత్తమ్మ చేతులు పట్టుకుంది జానకి.

రత్తమ్మ హృదయం కరిగిపోయింది.

జాలీ కనికరమూ ఆమె రక్తనాడుల్లో పరుగులు తీశాయి.

వెంటనే ఆమె రెడ్డితో "అన్నమాటే" అంది. పార్వతీశంతో "నువ్వు

బెంగపెట్టుకో" కంది. "ఇక్కడకాదు, రా" అంటూ చెయ్యిపట్టుకుని జానకమ్మ నింటోకి తీసుకు వెళ్ళింది, చివరికి.

"సెబాస్" అన్నాడు రెడ్డి.

పొంగిపోతూ పుబ్బెత్తుగా లేచి "అదీ మాట, దయఅంటే అలా వుండాలి" అంటూ రత్తమ్మ వెనకనే యింటోకి వెళ్ళాడు పార్వతీశం.

20

రొజుకుంటూ వెళ్ళి, వెంకటేశం, జరిగిం దంతా చెప్పగా "లాం — జముండని పచ్చడిచేసేద్దాం రండ రంగిని" అంటూ సూరన్న యెగిరిపడ్డాడు.

"నలుగురమూ వెళ్ళి పార్వతీశంగాణ్ణి తన్నేద్దాం రండి" అంటూ రామస్వామి నడుం బిగించాడు.

"ఎంతపని చేశాడూ అభాగ్యుడూ?" అంటూ సూరావధాని రుద్రుడయి పోయాడు.

వారిలో వొక్క భీమన్న శాస్త్రి మాత్రం తొందరపడలేదు. పైపెచ్చు, తమ్ముళ్ళీ తండ్రినీ సద్దణచి "మునసబు నోమాటు తీసుకురారా" అని పోతు నాయణ్ణి పంపాడు.

ఇది యిలా జరుగుతూ వుండగా యింటోకి వెళ్ళి "చితక బొడిచేశాను గాడిదకొడుకుని" అంటూ ఆడవాళ్ళదగ్గిర పురాణం విడేశాడు వెంకటేశం.

"అయ్యో" అంటూ ముసలమ్మ కూలబడిపోయింది.

"ఏం పోయేకాలం వచ్చింది వదినకి?" అంటూ వెంకటేశం పెళ్ళాం పరవళ్ళు తొక్కింది.

"దినాలు గడవాలి. అప్పుడే తీరిందా సంబరం?" అని వితంతుకోడలు సాగతీసుకుంది.

"ఎన్నాళ్ళనుంచో యీ స్నేహాలు?" అంటూ సూరన్న పెళ్ళాం మూతి ముడుచుకుంది.

పెద్దకోడలు నోరువిప్పలేదు; కాని, అత్తగారికేసి చూస్తూ వెటకారంగా నవ్వి తనగదిలోకి చక్కాపోయింది.

ఆమాటలు గుండెలు బద్దలుకొట్టగా, యీనవ్వు ప్రాణాలు తోడెయ్యగా రామసోదెమ్మ ముందు ఇల్లంతా చూసి, తరవాత చిన్నదొడ్డి వెతికి చివరికి, పెద్దదొడ్డి అంతా తిరిగి "వోసి నీ మొగం మండిపోనూ, యెక్కడ తగలడ్డావే రంగీ?" అంటూ మోటబావిదగ్గిర చతికిలబడి పోయింది, వగర్చుకుంటూ.

రంగనాయిక ఆవరణలో యెక్కడా లేదని తెలిశాటప్పటికి మొగాళ్ళు

వాడితోనే పోయింది, పదండి కొంపకి నిప్పుపెట్టేదాం" అని వొకడూ "జుట్టు పట్టుకుని వాడిపెళ్ళాన్ని వీధిలో బరబరా యీడ్చేద్దాం రండి" అని వొకడూ యెగిసిపడ్డారు.

"శపించేసి వీడివంశం నిర్వంశం చేసేస్తా" నంటూ సూరావధానులు చెంబుకోసం అటూ యిటూ చూశాడు.

నాలుగ్గాళ్ళ రాత్రిదాకా ఆలోచించి "నలుగురు (ఫలానా ఫలానా) రెడ్లని వెంటబెట్టుకువచ్చి, పార్వతీశం, వెంకటేశాన్ని తన్నించి, కుమ్మించి, గుద్దించి, కొట్టించి, ఈడ్పించి వెళ్ళిపోయినట్టు పోరి భీమన్నశాస్త్రి మునసుబు చేత బకీరు రాయించాడు.

ఏదో కూనీకేసు సందర్భంలో పోలీసుముఠా లొల్ల గ్రామంలో మకాం చేసి వుండగా, రాత్రికి రాత్రి బకీరక్కడకే వెళ్ళిపోయింది.

21

కాలాని కొక్కటే పని.

అది రావడం. వచ్చి వెళ్ళిపోవడ మున్ను.

నిజానికి రెండూ వొకటే; కాని సావధిక మైన మనుష్యుని దృష్టిలో వుందీ విభాగం.

ఇంతే కాదు, ఒక్కొక్కప్పుడు కాలం అతి వడిగా వచ్చేసినట్టు కనబడుతుంది. మరొక్కొక్కప్పుడు అతి మందంగా వచ్చిన ట్టనిపిస్తుంది.

వెళ్ళేటప్పుడున్నూ ఈ హెచ్చుతగ్గులు కనపడతాయి.

ఇది కూడా మనుష్య జీవితం సావధికం కావడంవల్ల కనపడేదే.

"అయ్యో, దినాలు దొర్లిపోతున్నా"యని కొందరు బెంగపెట్టుకుంటారు.

"పొద్దుగూకదు, తెల్లావారదు" అని కొందరు దిగులుపడతారు.

"ధర్మం దిగనారిపోతోంది. అంతా కాలమహిమ" అంటూ కొందరు దేవుళ్ళాడతారు.

"కాలం యింకా పక్వం కాలేదు" అని కొందరు నిరీక్షిస్తూ వుంటారు.

ఏమయినా, అది హృదయం బద్దలుకొట్టే దుఃఖాలూ మోసుకువస్తుంది.

ఆనంద పారవశ్యం కలిగించే సుఖాలూ తీసుకువస్తుంది.

ఏమీ తోచనివ్వని స్తబ్ధతా వెంటబెట్టుకుని వస్తుంది.

అనేక విషయాలలో దిగ్భ్రాంతి కలిగించే మార్పులూ గెంటుకువస్తుంది.

అయితే, యివేవీ కాలికాలు కావు.

ఒక్క ప్రగతి మాత్రమే కాలికం.

ఎండలు మండిపోతూవుండినా, వానలు ముంచెత్తేస్తూ వుండినా, చలి గజగజలాడించేస్తూ వుండినా, అది ఆగదు.

నిలవదు కూడాను.

వస్తూనే వుంటుంది.

వెళ్ళిపోతూనూ వుంటుంది.

ఒక్క ప్రమాణంలో జరిగిపోవడమే దానిపని.

నిజాని కిది యెరగనివా రెవరూ లేరు.

ఈగుర్తు నిలుపుకోగలవారు మాత్రం లేరు, అంతే.

ఆవేళ అలాగే తటస్థించింది.

పార్వతీశమూ రెడ్డీ అలా కూచునేవుండగా సూర్యాస్తమానం అయింది.

వెలుగుపోయింది.

చీకటి పడింది.

అది ఘనీభవించింది.

ఊరు మాటుమణిగింది.

ఇదంతా పార్వతీశం గుర్తిస్తూనే వున్నాడు.

ఆపూట అక్కడే భోజనం చేసిన – వుండిస్నిపోయిన రెడ్డికూడా చూస్తూనే వున్నాడు.

ఇవన్నీ సక్రమంగానే – వరాసగానే జరిగిపోయాయి; కాని, తరవాత కాలం నిలిచిపోయిన ట్టనిపించింది.

నిద్రరాదు.

పోనీ అంటే మెళుకువగా వుండి చేసేది కనబడదు.

కోదండరామరెడ్డి వచ్చి బకీరు వెళ్ళిపోయిన సంగతి చెప్పి వెళ్ళిపోయాడు.

దానిమీద యేమి జరుగుతుందో?

అసలు, దాల్లో ఏమి ఆరోపణ లున్నాయో?

అందులో యెవరెవ రిరుక్కున్నారో?

రంగనాయికను కూడా అందులో కీడ్చారో యేమిటో?

కొండారెడ్డి రామచంద్రునితో మాట్టాడివచ్చి రంగనాయిక పుట్టింటివారు మళ్ళీ తొంగిచూడలే దని చెప్పి వెళ్ళిపోయాడు.

దానిక్కారణం క్రోధమో, కళంకభీతో, నిర్మమతో?

భద్రమ్మత్త ఆమె కేమయినా విరుగుడు మాటలు చెబుతోందేమో?

నరసింహదీక్షితులుమామ చీవాట్లు పెడుతున్నాడేమో?

రంగనాయిక అందుకు వగుస్తోందో సంతోషిస్తోందో?

యేమి ఆలోచనలు చేస్తోందో?

జరిగిం దానికి పశ్చాత్తాపపడుతోందో, తెగింపే చేసుకుంటోందో?

పరిస్థితులకు లొంగిపోయి ఆమె తనకి ప్రతికూలంగా మాట్లాడుతుందో, మాటే ఆడదో?

ఇంతవరకూ వచ్చాక, చివరి కామె యేమి చేస్తుందో?

ఏమి చేస్తే యేమి జరుగుతుందో?

ఇలాగ వారి కిద్దరికీ వొకటే ఆందోళన.

దానివల్ల రకరకాల వూహలు.

వాటిమీద పకడ్బైన యెత్తులు.

వాటివెనకనే బలమైన విఘాతాలు.

ఎటూ నిర్ధారణ కాక "చివరి కేమయినా కానీ" అని తెగింపు.

అవ్యవధానంగా "అయితేనూ?" అంటూ మళ్ళీ యథాపూర్వకంగా జిజ్ఞాస.

ఊరు మాటుమణిగాటప్పటికి పార్వతీశమూ బలరామరెడ్డి యీస్థితికి వచ్చారు.

వచ్చి యీస్థితిలోనే వుండిపోయారు.

అయితే, వారుండిపోతే కాలం వుండిపోతుందా?

నిశీథం అయింది.

చుక్క పొడిచింది.

కోళ్ళు కూశాయి.

పచ్చిరంగులాగ చీకటి వెలిసిపోయింది.

తుమ్మెదలు శ్రుతివెయ్యగా కోకిలలు ప్రభాతగీతాలు ఆలాపన చేశాయి.

చివరికి, భళ్ళున తెల్లవారేసింది.

ఎర్రనికిరణాలతో సూర్యుడు పొడుపుకొండమీదికి రాగా, ఎర్రని టోపీలతో పోలీసులు వూళ్ళోకి వచ్చారు.

22

సూపర్నెంటు గ్రామకచేరిలో కొలువుతీరాడు.

వెంకటేశం "చరిత్రాత్మక"మైన వాఙ్మూలం యిచ్చాడు.

తరవాత పెద్దపాలికాపు సాక్ష్యం చెప్పడానికి వచ్చాడు.

టంచన్‌గా నుంచుని సర్కిల్ ఇన్‌స్పెక్టరు తీవిగా అడగ్గా "పార్వతీశం బాబయ్యగారూ మా చిన్నదొరగారూ కలబడ్డం నిరుకేనండి" అంటూ ప్రారంభించాడు వాడు.

"ముందెవరు కలియబడ్డారు?" అని సర్కిలు ప్రశ్న.

"ఇద్దరూ ముందుకురికితేనే కలబడ్డం అవుద్దండి మరి. ముందేటండి ముందు?" అని వాడి ముదలకింపు.

"పోనీ, ముందెవరు కొట్టారు?"

"ఎవరూ కొట్టలేదండి"

ఇలా అని వాడు తనకేసి వోరచూపులు చూడగా, కొండారెడ్డి, సుతారంగా తల పంకించి, మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

"అయితే, ముందెవరు కుమ్మారు?"

"ఎవరూ కుమ్మలేదండి"

మున్సబు కరణాలు మొగమొగాలు చూసుకున్నారు.

వాడికేసి భీమన్నశాస్త్రి కరుగ్గా చూడగా, భీమన్నశాస్త్రికేసి సబిన్‌స్పెక్టరు చురుగ్గా చూశాడు.

ఈవ్యవధానంలో చెదిరిపోయిన తన ప్రతిభ కూడదీసుకుని, సర్కిలు "వారిద్దరూ వొకరిజుట్టు వొకరు పట్టుకున్నారంటావు. అంతేనా?" అని బెల్లించాడు.

"వారిలో వొకరికీ జుట్టులేదండి బాబయ్యా"

"జుట్టంటే క్రాపింగనుకో"

"అలా మనవిచేసుకోండి బాబయ్యా! మాచిన్నదొరగారి క్రాపింగు పార్వతీశం బాబయ్యగారి చేతిలో వుందనుకోండి. పార్వతీశం బాబయ్యగారి మెడకాయ మాచిన్నదొరగారి చేతిలో వుందనుకోండి"

"అది సరే కాని ముందెవ్వరు పట్టుకున్నారంటావ్?"

"నేను చూశాటప్పటికే వారి క్రాపింగు వీరూ వీరి మెడకాయ వారూ పట్టుకుని వున్నారంటాను దేవరా"

సబ్బా సర్కిలూ మొగమొగాలు చూసుకున్నారు.

అది గుర్తించి "ఏమంటున్నా"డన్నాడు దొర.

"వాడు చాలా అంటున్నాడు; కాని వొక్కటీ మనకి పనికివచ్చేది లేదండి" అని బదులు చెప్పాడు సర్కిలు.

దానిమీద "డామిట్!" మనకి కావలసిందా అడుగుతున్నావు? వాడు

చూసింది చూసినట్టు చెప్పమను" అని దొర కసరగా, వొక్క క్షణం తమాయించి "నువ్వు చూసింది చూసినట్టు చెప్పరా" అన్నాడు సర్కిలు.

వెంటనే "మరిగంటే—" అంటూ అందుకున్నాడు వాడు; కాని యింతలో "దొరగారు చిత్తగించాలి" అంటూ వొక ఆడకుయ్యి వినిపించింది.

23

అందరూ వులిక్కిపడ్డారు.

చూడగా నమస్కారం చేస్తూ దొర యెదట రంగనాయిక నిలిచివుంది.

దొడ్డిగుమ్మాన హాల్లో ప్రవేశపెట్టి, సింహద్వారందాకా సాగనంపి మాయమైనాడు రామచంద్రుడు.

అక్కణ్ణుంచి వొక్క అంగలో దొరయెదటికి వచ్చి వాలిందామె.

చెదరిపోయిన అందరి చూపులూ వొక్క క్షణానికి కుదుటపడ్డాయి.

అప్పుడు వ్యవహారం విషమించిందని గుర్తువచ్చిందివారికి.

మున్సబు "కథ యెదురుతిరిగిం"దనగా "చిక్కేనయ్యోయ్" అన్నాడు కరణం.

భీమన్నశాస్త్రీ వెంకటేశమూ నిలువునా కొయ్యయిపోయారు.

సూరావధాని తలకాయ తీసుకువెళ్ళి పొట్టలో పెట్టుకున్నాడు.

ఇది గమనించి "పదపద, యిక్కడికెందుకు వచ్చావ్?" అని గదుముతూ వచ్చి సూరన్నా రామస్వామీ లాక్కుపోదామని చూశారు; గాని "దొరగారూ, నన్ను రక్షించండి" అంటూ ఆమె గోలచెయ్యగా, దొర ఇంగితం కనిపెట్టి సబిన స్పెక్టరు వారిని వెనక్కి పంపేశాడు.

దానిమీద భీమన్నశాస్త్రి వూరుకోలేక "ఆమె మా చెల్లెలు. ఆమె యిలాగ నలుగురిలోకి రావడం మాకు మర్యాదకాదు; కనక, ఆమెని మాయింటికి తీసుకు వెళ్ళడానికి సెలవిప్పించండి" అని కోరాడు దొరని.

"ఆమె నాయెదటి కెందుకు వచ్చిందీ?"

"దుర్బుద్ధివల్ల"

"ఎంతబలమైన కారణమూ లేకపోతే అయినయింటి పడుచు ఇలా వీధికి వస్తుందీ?"

"ఎవరో దుర్బోధ చేసి వుంటారండి"

"వాళ్ళకి కారణం?"

"మేమంటే కిట్టకపోవడమే"

దీనిమీద "మావాళ్ళంటే కిట్టనివాళ్ళెవళ్ళూ లేరండి. మావాళ్ళకే నేనంటే కిట్టదండి" అంది రంగనాయిక.

భీమ్మన్న శాస్త్రి మాట్టాడలేకపోయాడు.

అది చూసి "నువ్వు వచ్చిన పనేమిటి?" అనడిగాడు రంగనాయికని దొర.

దానికి "తమరిప్పుడు విచారణ సాగిస్తున్న దొమ్ములాట నామూలాన జరిగిందేనండి" అని కొంచెం సంకోచిస్తూ తల వంచుకుని బదులుచెప్పింది రంగనాయిక.

ఇది విన్న వారందరూ మెరుపుకొట్టిన ట్టయిపోయారు.

ముఖ్యంగా దొర "ఓ-హో" అంటూ తలపంకించి "అసలుకథ బయటికి వస్తోం" దన్నాడు.

"చిత్తం" అని వినయంగా నిట్టూర్పు విడిచాడు సర్కిలు.

మున్సబూ కరణమూ కళ్ళు తేలవేసుకున్నారు.

నుంచునివున్న భీమన్న శాస్త్రి మీది ప్రాణాలు మీదికే యెగిరి పోయాయి.

సూరావధాని కుతకుత వుడికిపోయాడు.

"భేష్, రసవంతమైనఘట్టం" అని మెల్లిగా అంటూ వూగిపోయాడు, నోట నువ్వుగింజ నానని వొకబ్రాహ్మణ యువకుడు.

"పొలంలో పనుంది నేను వెళ్ళిపోవచ్చునా బాబయ్యా" అనడిగాడు పాలికాపు.

కొండారెడ్డి మళ్ళీ మీసంమీద చెయ్యివేసుకున్నాడు.

24

గు-ప్పు మన్న గుసగుసలు చ-ప్పగా చల్లారాయి.

మున్సబు బకీరూ, వెంకటేశం వాజ్మూలమూ వొకపక్కకి తోసేసి "ఆ, యేమిటమ్మాయీ? ఏంజరిగిందీ?" అనడిగాడు, రంగనాయికని, దొర.

"పార్వతీశంగారూ, మావెంకటేశం అన్నయ్యా మా పెద్ద దొడ్లో కొట్టుకున్నమాట నిజమేనండి" అంది రంగనాయిక.

"కొట్టుకోడానిక్కారణం యేమి వచ్చిందీ?"

"నేనూ పార్వతీశంగారూ మాట్టాడుకుంటున్నాము. అది చూసి మా అన్నయ్య సహించలేకపోయాడు"

"పార్వతీశంగా రక్కడికి స్వయంగానే వచ్చారా?"

"లేదండి, నేను పిలిస్తే, సందేహించి సందేహించి, చివరికి నామాట తీసివెయ్యలేక వచ్చారు"

ఇదివిని "మామ్మే, మాతల్లే, నన్ను తప్పించిందమ్మా మాతల్లి" అంటూ, ఫణిమనిషి చాలాసంబర పడింది.

"నువ్వెందుకు పిలిచావూ?" అనడిగాడు దొర.

"వారి పాదా లాశ్రయించుకుందా మని"

"వా రెవరూ నీకూ?"

"కోరుకున్న పెనిమిటి"

ఈమాట అన్నప్పుడు బలితమైన మనశ్శక్తి ఆమెస్వరానికి గాంభీర్యం కలిగించగా, లలితమైన లజ్జ ఆమె మొగం వంచేసింది.

ఇదివిని అక్కడివా రందరూ వూగిపోయారు.

భీమన్న శాస్త్రి, కాళ్ళపట్టు తప్పిపోయి కూలబడగా సూరావధాని రెండుచేతులా మొగం కప్పుకున్నాడు.

ఈవ్యవధానంలో సర్కిల్ చెప్పిన మాటమీద "నువ్వు పితంతువు లా కనపడుతున్నావే?" అన్నాడు దొర.

దీంతో, కొరడాకొస తగిలినట్టయి రంగనాయికమ్మకి శౌర్యం ముంచుకు వచ్చింది.

మొగం ఎఱ్ఱబడింది.

అయినా వెంటనే సమాళించుకుని, దిటవున్నూ తెచ్చుకుని "నాకింకా పెళ్ళే కాలేదండి" అందామె.

అందరికంటే దొర యెక్కువగా వింతపడ్డాడు.

ఆవింత అతని కళ్ళల్లో ప్రశ్నార్థకాలు మొలిపించింది.

అదిగుర్తించి "ఇది స్పష్టంగా తెలవా లంటే కొంచెం ఓపికట్టాలి" అందామె.

"అనవసరం గొడవలు మనకెందుకూ?" అన్నట్టు చూశాడు సర్కిలు; కాని "ఓపిక పట్టా" నన్నాడు దొర.

దానిమీద ఒక్కక్షణం ఉపక్రమణిక వూహించుకుని రంగనాయిక ప్రారంభించింది.

"పార్వతీశంగారి తల్లి జబ్బుమనిషి. ఆమె ఆజబ్బులో వుండగానే పార్వతీశంగారికి వొడుగయింది. ఆ వొడుగులో వొకనాడు మాఅమ్మతో నేనూ వెళ్ళాను"

"......................."

"వారిచుట్టాలలో వొకావిడ "నువ్వు రోగిష్టిదానవు కదా, పంచశిఖలతో వుండగానే నీకొడుక్కి పెళ్ళి చేసుకోరాదుటే?" అనడిగిం దామెని. దానిమీద "అలాచేస్తేనే బాగుండును. లేకపోతే నాచిట్టితండ్రి పెళ్ళి నాకళ్ళ బడుతుందో పడదో?" అన్నారామె. అని అలాగా ఖులాగా చూడ్డంలో పక్కనున్న నేను

కనపడగా, నన్ను చేతుల్లోకి తీసుకుని "మానాయన్ని పెళ్ళాడతావుటే పిల్లా?" అనడుగుతూ నన్ను గుండెలికి హొత్తుకున్నారు. దాంతో, ఆమె సందిట నేను కరిగిపోయా ననుకున్నాను. అప్పుడే వారితో పీటలమీద కూచోవా లన్నంత వుబలాటం పుట్టింది నాకు"

ఇది విని దొర కుర్చీకిచేరబడి "అది ప్రేమకాదు; కాని చలచిత్తులు కాని వారికి కాలక్రమాన ప్రేమ అయిపోవచ్చు" నంటూ మళ్ళీ సరిగా కూచుని "తరవాతా?" అనడిగాడు.

"మరో రెండుమాసాల కాజబ్బు ముదిరి మంచాన పడిపోయా రామె. ఇక బతక రన్నమాట పుట్టాక మా అమ్మ ఆమెని చివరిమాటు చూడ్డానికి బయలు దేరింది. నేను కూడా వెళ్ళాను. మంచం మీద కాళ్ళకాడదిక్కున కూచుని అప్పటికి వారు తల్లిగారికి పాదసేవ చేస్తున్నారు. అది చూశాటప్పటికి నాకు "అతని పక్కని కూచుని నువ్వు కూడా నీఅత్తగారికి కాళ్ళు పట్టరాదుటే పాపం?" అని నన్నెవరో గదిమినట్టనిపించింది. దీనికి సాయం, ఆస్థితిలో కూడా నన్ను చూపించి ఆమె "పెళ్ళాడతావా నాయనా?" అనడిగారు కొడుకుని. ఇద్దరమూ సిగ్గుపడ్డాం, ఆసిగ్గుతోనే యిద్దరమూ చూసుకున్నాం. ఆచూపుతోనే ఇద్దరమూ "సంయే అంటే సంయే" అనుకున్నాం. ఏదో సరికొత్తసుఖం అనుభవానికి వచ్చినట్టయింది నాకు"

"అదీ సంగతి" అని బల్లగుద్ది అందుకున్నాడు దొర.

"చాలా చక్కని సన్నివేశం అది. నిజంగా అది దైవికమైన సంఘటన. ప్రేమపరిణామానికి అది ప్రారంభం. అయితే, చెప్పాను కాదూ? స్థిరచిత్తుల విషయంలోనే అది దృఢపడి కొనలుసాగుతుంది"

సర్కిలుతో యిలా చెప్పి, దొర "తరవాతా?" అని మళ్ళీ అడిగా డామెని.

"మరో నాలుగు దినాల కామె చనిపోయా" రంది రంగనాయిక నీరసంగా.

ఇలా అని వొక్కక్షణం ఆమె నీరవురాలయి పోయి గుక్కిళ్ళు మింగింది.

అది దొరకి సానుభూతి కలిగించింది.

"ఆసంవత్సరం చదువు మానేసి వారు ఊళ్ళోనే వుండిపోయారు. వారి గుమ్మంలో నుంచే నేను బడికి వెళ్ళేదాన్ని. ఒకనాడు అరుగుమీద కూచునివుండి వారు నన్ను పిలిచారు; కాని నేను అలా చూదామనుకుంటూనే చూడలేక పోయాను. మాట్టాడదా మనుకుంటూనే మాట్టాడలేకపోయాను. నుంచోనైనా నుంచుందా మనుకుంటూనే నుంచోలేకపోయాను.

"........................ ..."

"మర్నాడు మళ్ళీ పిలిచారు. "నుంచోవూ రంగా" అని మళ్ళీ పిలిచా టప్పటికి నేను కదల్లేకపోయాను. నన్నంత ముద్దుగా అంతవరకూ యెవరూ పిలవలేదు. వారయినా అదే మొదటిమాటు. ఆ పిలుపు నాగుండెల్లో నిండి పోయింది. నాకాళ్ళకి బందా లయిపోయింది. వెంటనే వీధిలోనే దగ్గిరికి వచ్చి, బుజ్జగించి, గడ్డంపట్టుకుని నా మొగం పైకెత్తి కళ్ళల్లోకి గంభీరంగా చూసి చిరునవ్వు నవ్వారు. దాంతో నిలువునా కరిగిపోయాను నేను. తరవాత, యించక్కని బొమ్మల పుస్తకం చేతిలోపెట్టి వెన్నుతట్టి పంపేశారు"

ఇది విని కనుబొమ్మ లెగరవేసుకుంటూ "చాలా మంచి పిల్లవాడు. యువరాజు కాదగ్గ పిల్లవాడు" అన్నాడు దొర వృద్ధిక్కుడై.

దాంతో రంగనాయిక చెక్కిళ్ళు గరిపొడిచాయి.

చాలామంది కళ్ళు చెమ్మగిల్లాయి.

అపవారించి, సూరావధాని నెత్తినోరూ బాదుకున్నాడు.

25

పూర్తిగా వొక్కనిమిషం మాట్లాడలేకపోయింది రంగనాయిక.

ఎదటి గోడమీద అభావదృష్టులు పరుపుతూ వుండిపోయిం దామె.

కళ్ళనిండా నీళ్ళు కమ్మి ఆ అభావదృష్టులు కూడా మందగించిపోయాయి.

అది చూసి దొర చకితు డయినాడు.

చివరికి తనకి తానే ప్రకృతిలోపడి, కంఠం సవరించుకుని, మళ్ళీ మెల్లిగా ప్రారంభించిం దామె.

"తరవాత వారు నన్ను పలకరించని దినంలేదు. నేను బడికి వెళ్ళే టప్పుడో, యింటికి వెళ్ళేటప్పుడో – యెప్పుడో వొకప్పుడు, కనిపెట్టుకుని వుండి నన్ను పలకరించేవారు. కనపడనినాడూ, పలకరించనినాడూ నేనూ బడిలో బొమ్మలా వుండిపోయేదాన్ని. ఇంటికి వెడితే భోజనం సయించేది కాదు."

ఇది విని సర్కిలు గతుక్కుమన్నాడు.

తన పదకొండేళ్ళ కూతురు కూడా యిలాగే యేపిల్లాణ్ణయినా చూసుకుని చెడిపోతోందేమో అని కంగారుపడి పోయా డతను.

ఆమె మళ్ళీ అందుకుంది.

"వారు నాకు చక్కని కలా లెన్నో యిచ్చారు. ఎన్నో బొమ్మలపుస్తకా లిచ్చారు. ఎన్నిమాట్లో బత్తాయిపళ్ళు వొలిచిపెట్టారు. ఎన్నిమాట్లో గులాబీ పువ్వులు నాజెడలో వుంచారు. చివరికి ఇస్కూళ్ళు తెరిచాక చదువుకోసం

రాజమండ్రి వెళ్ళిపోతూ వొకనాడు నన్ను తమవాకిట్లోకి పిలిచి" మళ్ళీ వచ్చాటప్పుడు నీకేమి తెచ్చిపెట్టమంటా" వని లాలిస్తూ అడిగారు. "లక్ష్మీదేవి విగ్రహం చిన్నదీ వెండిదీ తెచ్చిపెట్ట" మన్నాను. జ్ఞాపకం వుంచుకుని వారది తెచ్చియిచ్చారు. ఇప్పటికీ నాపెట్టెలో వుం దది"

"........................"

"రాజమండ్రిలో చదివినంతకాలమూ వారు వారం వారమూ యింటికి వచ్చేవారు. నన్ను చూడకుండా వుండలేకే వారువచ్చేవారు. వారువచ్చేదాకా నేనూ వుండలేకపోయేదాన్ని. నా కేమిటేమిటో తెచ్చిపెట్టేవారు వారు. వారి పాదాలు కొలుచుకోడం తప్ప నేనేం చెయ్యగలనూ వారికి? ఇంతకీ: ఆ శని వారమూ ఆదివారమూ నేను వెన్నెట్లో తేలిపోయేదాన్ని. తక్కిన దినాల్లో అంధకారంలో మగ్గిపోయేదాన్ని"

"... ...."

"బి. ఏ. చదువుకి వారు చెన్నపట్నం వెళ్ళవలసి వచ్చింది. తండ్రిమాట జవదాటలేక తప్పనిసరిగా వారు ప్రయాణం కట్టుకున్నారు. ఇది తెలిసి నేను బెంగటిల్లి పోయాను. వారందినాలు నేను నిద్రాహారా లెరగను; కాని, చివరికి, వారు చెన్నపట్టం బి. ఏ. అయితేనే నాకు గొప్ప అనుకుని మనస్సు కుదుట పరుచుకున్నాను. మధ్యాహ్నం బయలుదేరి వారు వెడతా రనగా నేనుపొద్దున్న వారి ఇంటికి వెళ్ళాను. వీధిగుమ్మాన వెడితే యెవరయినా చూసి పోతారేమో అని దొడ్డిగుమ్మాన వెళ్ళాను. అప్పటికి వారు గదిలోపెట్టి సద్దుకుంటున్నారు. ఎదట పడాటప్పటి కిద్దరమూ పొంగిపోయాం. నేను మల్లెపువ్వులు దండగుచ్చి జాకెట్టులో దాచి పట్టుకువెళ్ళాను. నన్ను చూస్తూనే వారు దగ్గిరికి రావడమూ, వారిని చూస్తూనే నేను మల్లెదండ వెయ్యడమూ జరిగిపోయాయి"

దొర సర్కిలు కేసి చూశాడు.

"అప్పటికి నీవయస్సెంత?" అనడిగాడు సర్కిలు.

"పన్నెండో యేడు వెళ్ళింది" అంది రంగనాయిక.

"పూలదండ బాగా గుచ్చగలిగానో లేదో అని నేను బెదురుతూ పట్టుకు వెళ్ళాను; కాని వారిమెడలో అది మొలిచినట్టు కనపడింది. ఎక్కడలేని పరిమళమూ వచ్చినట్టున్నూ అయింది దానికి. నేను దండవేసినందు కెంతో సంబరపడి వారు అది తీసి నామెడలో వేసి "యిప్పుడు మరీ బాగుంది" అన్నారు. "మీకోసం గుచ్చితెచ్చా" నని నేనూ "పూల దండలు ఆడవాళ్ళకే బాగుంటా" యని వారూ కొంత సేపు పెనగులాడుకోడం అయినాక, నేను మళ్ళీ వారికే వేశానది"

ఇది విని మున్సబు చెవిలో నోరుపెట్టి "ఆముక్తమాల్యద" అని గొణిగాడు కరణం; కాని అదేమిటో బోధపడక ఒక్క క్షణం వింతచూపులు చూసి, చివరికి బాధ్యత అంతా తనమీదే వున్నట్టు కేసు వినసాగాడు మున్సబు.

"కొంత సేపటికి తండ్రిగారు వారిని భోజనానికి పిలిచారు. వెంటనే ఆ దండ తీసి జేబురుమాలులో చుట్టి పెట్టెలో పెట్టుకుని "రంగా, ఇది నాకూడా పట్టుకువెడతాను. వీలయినప్పుడల్లా చూసి నిన్ను చూసినట్టే వూహించుకుని ఆనందిస్తాను. ఎప్పుడూ నామీద యీదయ వుంచేం. నన్ను మరిచిపోకేం?" అంటూ నాకళ్ళలోకి గంభీరంగా చూశారు వారు. అందుకు నేను బదులు చెప్పలేక పోయాను. నాచైతన్యం అంతా ఆదండంలో యిమిడ్చేసినట్టయి పోయింది నాకు. పైపెచ్చు ఎందుకో ఏడుపువచ్చిందినాకు. నన్ను చూసి వారూ అలాగే అయిపోయారు"

దొర నిశ్చలంగా చూశాడు.

రంగనాయిక కళ్ళల్లో అప్పుడు కూడా ఆపరిస్థితి ప్రతి ఫలిస్తున్నట్టు కనపడిం దతనికి.

ఆచిహ్నం కంఠంలోకి మార్చుకుని మళ్ళీ అందుకుందామె.

"నాకళ్ళు చెమ్మగిల్లడం చూసీ చూడగానే, యెప్పుడూ లేంది గభీమని నన్ను పొదువుకున్నారు వారు. నేను నామొగం వారి మెడలో దాచుకుని కొంతసేపటికి మనస్సు దిటవుపరుచుకున్నాను. తరవాత, నన్ను పొదివి పట్టుకునే గుమ్మందాకా సాగనంపి, నేను సందులో నడిచినంత సేపూ నాకేసే చూశారు వారు"

ఇది వినీ చూసీ కరణం తనకేసి జాలిగా చూడగా, గోడవైపు మొగం తిప్పుకుని, సూరావధాని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు.

"అది ప్రేమ. ఈమె ప్రేమస్వరూపం. దేవునిదృష్టిలో అప్పుడే ఈమే ఆయువకుడూ భార్యాభర్తలయి పోయారు" అంటూ దొర ఆవేశంతో అనగా, సర్కిలు "ఇప్పటికీ యీఅమ్మాయి నిజంగా కన్యే. ఈమెకి తలిదండ్రులు చేశా మనుకుంటున్నది పెళ్ళికాదు, శిక్ష" అని భీమన్న శాస్త్రికేసి పులుకూ పులుకూ చూశాడు.

ఇదంతా చూసి పుట్టింటివారు తప్ప తక్కిన అందరూ రంగనాయిక యెడల వాత్సల్యముగ్ధు లయిపోయారు.

దొరకిన్నీ వాత్సల్యభావం కలిగింది.

అది హృదయం నిండిపోగా అతను "ప్రియమైన అమ్మాయీ, తరవాత ఏమి జరిగిందమ్మా" అని సాదరంగా అడిగాడు.

అది రంగనాయికమ్మకి దిటవు కలిగించింది.

దీంతో "వారిమీద కేసు నిలవ"దని నమ్మకమున్నూ కలిగిం దామెకి.

ఈధీమాతో ఆమె మళ్ళీ ప్రారంభించింది.

"యుక్తసమయంలో మావాళ్ళు నన్ను పార్వతీశంగారికే నిశ్చయపరిదారు. అందుకు నేను వెయ్యిమంది దేవుళ్ళకు మొక్కుకున్నాను; కాని హఠాత్తుగా వారి తండ్రి కాలంచేశారు. దాంతో ముహూర్తం దాటిపోయింది. తరవాత, యేమి దుర్బుద్ధి పుట్టిందో, మావాళ్ళు వారిని కాదని మరో కోతికి నన్ను కట్టబెట్టారు"

"దయ్యాలు" అంటూ సీదరించుకుని "అమ్మాయీ అందుకు నువ్విష్టపడ్డావా?" అని ఆత్రంగా అడిగాడు దొర.

"లేదండి. నాకా సంబంధం వద్దనీ, పార్వతీశంగారే కావాలనీ కచ్చితంగా చెప్పేశానండి, బతిమాలానండి. మంకుపట్టు పట్టి యేడ్చి, చివరికి భోజనం కూడా మానేశానండి. అయినా, మావాళ్ళు కాళ్ళూ చేతులూ విరిచికట్టి—"

ఆమె యిలా అనేటప్పటికి దొర అగ్గయిపోయాడు.

అతని చూపులు సర్కీలుమీద ఆగ్నేయాస్త్రాలు విజ్జిమ్మాయి.

అవి భరించలేక సర్కీలు మొగం వంచుకున్నాడు.

అప్పటికి తన వుద్యోగధర్మం జ్ఞాపకం వచ్చింది దొరకి.

"తరవాత యేం జరిగిందమ్మాయీ?" అని వెంటనే అడిగాడతను.

దానిమీద "నావుసురు తగిలి సంవత్సరం తిరక్కుండానే ఆపిల్లాడు గుటుక్కుమనేశాడండి" అనేసింది రంగనాయిక.

దొర తల పంకించాడు.

మున్సబూ కరణమూ గతుక్కుమన్నారు.

సర్కీలు గంభీరంగా చూడగా భీమన్నశాస్త్రి మొగం వంచుకున్నాడు.

సూరావధాని కళ్ళు తుడుచుకున్నాడు.

మొట్ట మొదటిమాటు వెంకటేశానికి ఆ పిల్లాడిమీద అసహ్యభావం కలిగింది.

26

ఇది యిలాజరుగుతూనే వుండగా వీధిలో సీత్కారాలూ, ఛీత్కారాలూ రేగాయి.

వెన్ను విరుచుకుంటూ వొక కానిస్టేబులూ, మడమ తాటించుకుంటూ సబిన్‌స్పెక్టరూ అసద్దణిదాటవ్పటికి మళ్ళీ రంగనాయిక అందుకుంది.

"ఆని విరగడ అయిపోయినందుకు నేను బ్రహ్మానందపడ్డాను; కాని "ముందుగతి యేమిటి?" అన్న విచారం పట్టుకుంది నాకు. నా హృదయం పార్వతీశంగారిని విడిచి పెట్టలేకపోయింది. ఎవరో వీరేశలింగం పంతులుగారి పేరు—"

రంగనాయిక యిలా అనేటప్పటికి, పంతులు యెడల తనకి వుండుకున్న గౌరవాదరాలవల్ల, దొర, అప్రయత్నంగా శిరస్సు వంచుకున్నాడు.

"చెప్పారు. నాకు ఆవేశం వచ్చింది. దాంతో మళ్ళీ కోరిక రేకెత్తింది. ఆశ పరుగులు తీసింది. దానిమీద ఎన్నో పరిశోధనలు చేశాను. ఎన్నో అడ్డంకులు దాటాను. నాతపనా, నాఆశా వారిలో మార్పు కలిగించినట్టు తెలిసింది. చివరికి వారిహృదయంలో వొకపక్క చిన్నస్థలం—"

"ఇప్పటి కింకా వారికి వివాహం కాలేదూ?" అనడిగాడు, దొర ఆత్రంగా.

"అయింది. ఆదంపతులు చిలకాగోరింకల్లాగ ఆనంద డోలికల్లో వూగి పోతూనే వున్నారు. అయితే వారికిద్దరికీ నామీద అనుగ్రహం కలిగింది. అంచేతనే వారి హృదయంలో వొకపక్క చిన్నస్థలం నాకు దొరికిందన్నాను" అని బదులు చెప్పింది రంగనాయిక.

దొర చకితుడై సర్కిలుకేసి చూశాడు.

సర్కిలు రంగనాయిక మీద సంశయదృక్కులు పరిపాడు.

సూరవధాని మొగాన ఔదాసీన్యమూ, భీమన్నశాస్త్రి మొగాన రోషం మంటలూ చూసి కరణం వింతపడ్డాడు.

చూసిచూసి. కంఠం సవరించుకుని, రంగనాయిక మళ్ళీ అందుకుంది.

"దీంతో మాపుట్టింట ముళ్ళమీద వున్నట్టనిపించింది నాకు. నాయింటికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను"

ఇలా అని ఒక్కక్షణం ఆగి "తెలిసిందా?" అన్నట్టు గంభీరంగా చూసి "నాయింటికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను" అని మళ్ళీ రెట్టించి, రంగనాయిక మళ్ళీ అందుకుంది.

నిన్న సాయంత్రం వారు పొలం వెళ్ళి వస్తున్నారు. ఒక్కరే వున్నారు. ఈసంగతి విన్నవించుకుందామని నేను మావాళ్ళ పెద్దదొడ్డోకి పిలిచాను. మొదట సంశయించారు; గాని చివరికి దయచేశారు వారు"

"వారివెంట మరెవరున్నారూ?" అనడిగాడు దొర.

"దేవుడు" అని అవ్యవధానంగా చెప్పేసి గంభీరంగా చూసింది రంగనాయిక.

సర్కిలు కేసి చూశాడు దొర.

ఏదో అడగడానికి సర్కిలు రంగనాయిక కేసి చూశాడు.

అది గుర్తించి "వెంట మరెవరయినా వుంటే నేనెందుకు పిలుస్తానూ వారినీ?" అని నిలవతీసినట్టడిగింది రంగనాయిక.

బకీరుచూసి "బలరామరెడ్డి, వోబిరెడ్డి, నరసింహారెడ్డి కోదండరామరెడ్డి,—" అంటూ చదివి "ఈ నలుగురూ పార్వతీశంగారి వెంట లోపలికి రాలేదూ?" అని మళ్ళీ అడిగాడు దొర.

"రాలేదు" అని దృఢంగా అని, పులుకూ పులుకూ చూస్తూ, "బకీరులో నాగొడవ యేమయినా వుందా?" అనడిగింది రంగనాయిక.

"లే"దన్నాడు దొర.

"ఇంకేం? ఉన్నది తీసేశారు. లేనిది కలిపారు. ఇదెవరు చేశారో నేను చెప్పలేను. తమరు విచారణ చేయించండి" అంది రంగనాయిక.

"బాగా జ్ఞాపకం చేసుకో" అన్నాడు సర్కిలు.

"పన్నెండు గంటలకిందట నాకళ్ళ యెదటే జరిగింది జరిగినట్టు చెప్పడానికి జ్ఞాపకం చేసుకోవాలా?" అని యెదురడిగిందామె.

చిత్తయిపోయి, దొరకేసి తెల్లమొగంపెట్టి మళ్ళీ అంతలో.

"పోనీ, మీ పెద్దపాలికాపు ఉన్నాడు కాడూ?" అనడిగాడు సర్కిలు.

అలవోకగా చూస్తూ "ఉన్నాడు" అని సర్కిలుకి, గంభీరంగాచూస్తూ "రాజమండ్రిలో" అని దొరకి బదులుచెప్పింది రంగనాయిక.

సర్కిలు గతుక్కుమన్నాడు.

మొగం వంచుకుని పాలికాపు నవ్వుకున్నాడు.

కరణం కేసి బెదురుగా చూశాడు మున్సబు.

భీమన్న శాస్త్రికేసి చూస్తూ "మాకంఠం మీదికి తెచ్చారండోయ్" అన్నట్టు తలపంకించుకున్నాడు కరణం.

అప్పటికొక విధంగా నిర్ధారణ చేసుకుని "తరవాతా?" అన్నాడు దొర.

"వారు దయచేశారు. నేను నాసంగతి మనవి చేసుకున్నాను. వారు కల్లోలం పుట్టవచ్చు నన్నారు. నాకు భయం లేదన్నాను నేను. ఇంకా అంటున్నాను. ఇంతలో యెలా చూశాడో రంకెలువేసుకుంటూ వచ్చి మా వెంకటేశం అన్నయ్య వారి మీద పడ్డాడు"

ఇది విని, వెంకటేశం, మీది పెదవి తడుముకున్నాడు.

అతని జట్టువాళ్ళు "సెబాస్" అనుకున్నారు.

చూసిచూసి "మీఅన్నయ్యకి సాయం యెవరూ?" అనడిగాడు సర్కిలు.

"కాళ్ళూ చేతులూనూ" అని సర్కిలుకి ఝుడితి ప్రత్యుత్తరం యిచ్చేసి, గంభీరంగా కూడా చూసి, మళ్ళీ ప్రారంభించింది రంగనాయిక.

"ఇద్దరూ కలియబడ్డారు. సమానంగా కొట్టుకున్నారు. మూడోవా ళ్ళెవళ్ళూ కలగచేసుకునేవాళ్ళు లేక ఆయాసం వచ్చేదాకా పెనగులాడు కున్నారు. మధ్యని, వారి నేమీ చెయ్య లేక మాఅన్నయ్య నామీద పడ్డాడు—"

సభలో ఛీత్కారాలు రేగాయి.

"రెండు తాపులు తన్ని వారు మా అన్నయ్య నీడ్చేశారు నిమిషంలో"

అక్కడ వున్నవారిలో చాలామంది గొల్లు మన్నారు. కొందరు మాత్రం కిచు మన్నారు.

"మళ్ళీ కలియబడ్డారు. మళ్ళీ కొట్టుకున్నారు. వొళ్ళు మరిచిపోయి కొట్టు కున్నారు. చివరికి మా అన్నయ్య ముందుగా ఇంటిదారి పట్టాడు"

మళ్ళీ పకపకలు రేగాయి.

వెంకటేశం మొగం వంచుకోకపూర్వమే కొండారెడ్డి మళ్ళీ మీసంమీద చెయ్యివేసుకున్నాడు.

27

సూరావధాని జగన్మిథ్యాత్మ మననం చేసుకున్నాడు.

భీమన్నశాస్త్రి తన లౌక్యప్రజ్ఞ స్మరించుకున్నాడు.

వెంటనే "మాచెల్లెలు అమాయికురాలు" అంటూ దొరయెదటికి వెళ్ళి "దాని కెవరో దుర్బోధ చేశారండి" అంటూ మళ్ళీ ప్రారంభించాడు.

"ఆమె చెప్పిన సంగతులు అబద్ధం అంటారా మీరు?" అనడిగాడు దొర.

"కొన్ని నిజమే"

"అబద్ధాలేమిటి?"

"చిత్తంచిత్తం నామనవి —" అంటూ చేతులు పిసుక్కున్నాడు శాస్త్రి.

"మీరు చెప్పుకునే దేమిటి?"

"మాచెల్లాయిని మాయింటికి తీసుకువెళ్ళి మాట్టాడడానికి సెలవిప్పిం చండి"

రంగనాయిక గుండెలు పీచుపీచు మన్నాయి; కాని దొర కనుబొమ్మలు ముడిపడ్డం చూసి ఆమె తేరుకుంది.

అదీ, దొర యింగితమూ గుర్తించి "మీ అన్నయ్య కేంచెబుతావమ్మాయీ?" అనడిగాడు సర్కిలు.

"నేను వెళ్ళనండి" అంది రంగనాయిక.

"బాగా ఆలోచించుకో" అని బెల్లించాడు సర్కిలు.

"అంతాయింతా కాదు, చాలాచాలా ఆలోచించుకునే చెబుతున్నానండి. ఈజన్మలో నేనిక నాపుట్టింటిగడప దాటను"

శాస్త్రి మొగాన "దాటనిస్తేనా?" అన్న భావం ప్రతిఫలించిది; కాని సూరావధాని తక్కు మనిపోయాడు.

"తల్లిని తండ్రినీ వొదులుకుంటావా?"

"వాళ్ళే నన్ను వొదులుకున్నారండి"

నిట్టూర్చి, బుర్రవంచుకుని భీమన్న శాస్త్రీ చిన్న అరుగు మీదికి వెళ్ళిపోయాడు.

ఒక్కక్షణం యెవరూ మాట్టాడలేదు.

ఆక్షణాన చీమకూడా చిటుక్కుమనలేదు.

ఆగాంభీర్యం వొక్కమాటు దొరభావచక్రాన్ని తిప్పేసింది.

ఆచక్రభ్రమణంలో యేమిటేమిటో పటాలు మెరిసి పోయాయి.

ఆమెరుపుతో, తన దేశానికీ యీదేశానికీ యెంతదూరంవుందో, తన సంఘానికీ యీ సంఘానికీ యెంత వార వుందో స్పష్టంగా గోచరించిందతనికి.

మరి తనకీ యీవ్యవహారానికీనో?

దూరం లేక పోవడమే కాదు, సంబంధమే వుంది.

సర్వమూ తన ఆధీనంలోనే వుం దిప్పుడు.

ఈసంగతి స్ఫురించాటప్పటికి, క్షణికమై సార్వజనీనత తిరోహిత మయి పోయి, అతనికి అధికారదర్పం సాక్షాత్కరించింది.

అది మొగాన ప్రతిఫలించింది.

అదిగుర్తించి, వెంటనే మరింత టంచన్‌గా నుంచుని, తన సావధానత దొర దివ్యచిత్తానికి నివేదించుకున్నాడు సర్కిలు.

అప్పుడు "ఇటు హృదయం వూపేసే సత్యమూ, అటు గుండెలులేని కల్పనానూ" అని తీక్ష్ణంగా చూశాడు దొర.

ఆచూపు చిన్న అరుగుమీద చిచ్చుబుడ్డి అయింది.

దీనికి సాయం కరణం వీపుగిల్లగా కొంచెం వొణుకుతూ లేచి, వంగి ముందుగా మున్సబు చేతులు దోయిలించుకున్నాడు.

అది చూసి, వ్యవహారం మరో అంతస్థుకి వెళ్ళిపోతూవుందని గ్రహించి "మరి నాకు సెలవు దయచేయించండి" అంది రంగనాయిక.

"అవును, ఈమె యింకెందుకూ?" అన్నట్టు చూశాడు సర్కిలు. దాని మీద తలపంకించి "నీసంగతి యేమి టమ్మాయీ?" అనడిగాడు దొర.

"నాకు సెలవిప్పించండి"

"వెళ్ళవచ్చు"

"నేను నాయింటికి వెళ్ళిపోతున్నాను"

చూసిచూసి "నీయింటికా?" అనడిగాడు దొర.

"అవును, నాయింటికే. పార్వతీశంగారి యిల్లే నాయిల్లు"

ఈమాట ధీమాగానే చెప్పింది; కాని చెప్పిన తరవాత [illegible] ఆమె చెక్కిళ్ళమీదా కళ్ళలోనూ కొత్త సిగ్గు మెరిసింది.

"అది నీయిష్టం" అన్నాడు దొర.

"మీరుచూస్తూనే వున్నారు. నేను మావాళ్ళయింట్లో నుంచి విడిచేతులతో యివతలికి వచ్చాను"

ఇలా చెబుతూ ఆమె తన రెండు చేతులూ తిప్పితిప్పి చూపించింది.

"చూశాను"

"గొడవలన్నీ మీరు చిత్తగించే వున్నారు. నేను మీ రక్షణ కోరుతున్నాను"

"నీ కేమీ భయంలేదు. ఘనతవహించిన శ్రీ చక్రవర్తి గారి పరివారం యావత్తూ సర్వకాల సర్వావస్థల్లోనూ నీకు పెట్టనికోట అయివుంటుంది, భయపడకు"

ఇలాచెప్పి, దొర, ఆమె ప్రార్థన నోటుచేసుకున్నాడు.

"ఎప్పు డెలాంటి ఐకీర్లు వస్తాయో? రాయవరం గ్రామం మీరొక కంటితో కనిపెడుతూ వుండాలి"

"అవశ్యమూనూ"

ఇలా అంటూ గంభీరంగా లేచి నుంచుని "ఈమె మేజరు. స్వతంత్రురాలు. ఎక్కడికి వెళ్ళడాని కయినా, తన జీవన విధానం యెలా నిశ్చయించుకోడాని కయినా యీమెకి హక్కుంది. తనభారం అంతా దేవునిమీదవేసి యీమె వొట్టిచేతులతో బయలుదేరడం కూడా రికార్డయింది, కనక, యీమె కెవరయినా అడ్డువెళ్ళారంటే సంకెళ్ళు పడతాయి. ఇప్పుడే కాదెప్పు డయినాసరే యీమె స్వేచ్ఛ కెవరయినాసరే అభ్యంతరం కలిగించారంటే కఠినవరకం పడుతుంది" అంటూ వురిమినట్టు చెప్పాడు దొర.

పట్టలేక సూరావధాని బారుమన్నాడు.

అన్ని విధాలా వుచ్చులు బిగవడం చూసి భీమన్నశాస్త్రి మొగం వంచుకుని చతికిలపడ్డాడు.

"మీరూ మీరూ బాగానేవున్నారు, చివరికి మాకూ వురి. మంచిపని చేశారు లెండి" అని తొడమీద పొడిచి, మున్సబు, భీమన్నశాస్త్రిని నిష్ఠురాలాడాడు.

బరాబరులు చేస్తున్నట్టిద్దరు కానిస్టేబిల్సు జనాన్ని తప్పించి దారిచేశారు.

వెంటనే అంజలిబంధం నుదుట అన్చుకుని దొరకేసి తిరిగి నమ్రురాలై, భూమి కవతరిస్తున్న దేవకన్యలాగ మెల్లిగా అరుగు దిగింది రంగనాయిక.

1931 జులై భారతినుంచి
పెంపకం

—(౦)—